నేటి కందం-నేటికి అందం

సదమలముగ నీ దినమున
పదునెనిమిది వేల కోట్ల పనులను మోడీ
మొదలిడె మన అభివృద్ధిని
కదమును ద్రొక్కించ నెంచి క్రమ పథములోన్ !!

(భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు సూరత్ లో పదునెనిమిది వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి, ఇది దేశ సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తుంది అని అన్నారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

వాళ్లంతా అవినీతి
వీళ్లేమి చేస్తున్నరు
అందినంతా మల్లెల్లా
అదేతీరు మేస్తున్నరు
నాడు నేడు ఎప్పుడైనా
నడక ఏదీ మారలే
స్వచ్ఛమనే మాటతప్ప
సత్పాలన నెరవేరలే

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 7-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:238 పేజీలు:6 వెల: రూ.1/-


## నీట్ పరీక్ష భద్రతపై ప్రత్యేక దృష్టి.. సీఎస్ కీలక ఆదేశాలు



హైదరాబాద్, జూన్ 6:జూన్ 21వ తేదీన జరగనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఈరోజు(శనివారం) సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24 నగరాల్లో 72,956 మంది విద్యార్థులు నీట్‌కు హాజరు కానున్నారని చెప్పుకొచ్చారు.

పరీక్షా కేంద్రాల్లో భద్రత, విద్యుత్, తాగునీరు, రవాణా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు దిశానిర్దేశం చేశారు. నీట్ ప్రశ్నాపత్రాల రవాణాకు తొలిసారిగా భారత వైమానిక దళం సేవలు వినియోగిస్తున్నట్లు వివరించారు. ఈ పరీక్షల భద్రతకు ఈసారి ప్రత్యేక భద్రతా ప్రోటోకాల్స్ అమలు చేస్తున్నామని సీఎస్ రామకృష్ణారావు పేర్కొన్నారు.

## మళ్లీ దాడులకు దిగిన ఇరాన్.. గల్ఫ్‌లో కలకలం



న్యూ ఢిల్లీ, జూన్ 6:గల్ఫ్‌లో మళ్లీ కలకలం రేగుతోంది. కువైట్, బహ్రెయిన్‌లను టార్గెట్ చేస్తూ ఇరాన్ శనివారం మిసైల్స్‌ను ప్రయోగించడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. అమెరికా తమను రెచ్చగొట్టడంతోనే ఈ దాడులు చేయాల్సి వచ్చిందని ఇరాన్ ఆరోపించింది. కువైట్, బహ్రెయిన్ గగనతలంలో మిసైల్స్ దూసుకుపోతున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ దాడుల నేపథ్యంలో కువైట్, బహ్రెయిన్ ప్రభుత్వాలు సైరెన్‌లు మోగించి ప్రజలను అప్రమత్తం చేశాయి.

తాజా దాడులపై స్పందించిన ఇరాన్ సైన్యం ప్రతినిధి.. పరిస్థితి మళ్లీ దిగజారడానికి అమెరికానే కారణమని ఆరోపించారు. కువైట్, బహ్రెయిన్ వైపు వెళుతున్న విమానాలను దారి మళ్లించాలని సూచించారు. అక్కడి ప్రజలు ఎయిర్‌పోర్టులకు దూరంగా ఉండాలని చెప్పారు. మరోవైపు, ఇరాన్ దాడుల నేపథ్యంలో శనివారం కువైట్ ఎయిర్‌పోర్టులో పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరికొన్నింటిని దారి మళ్లించినట్టు ఫ్లైట్ రాడార్ 24 సంస్థ పేర్కొంది. యూఎస్ సైనిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలను ఇరాన్ తరచూ టార్గెట్ చేస్తున్న విషయం తెలిసిందే.ఇరాన్ మొత్తం ఏడు మిసైల్స్‌ను కువైట్, బహ్రెయిన్ వైపు ప్రయోగించిందని అమెరికా సైనిక అధికారులు తెలిపారు. తాము ఆరు మిసైల్స్‌ను అడ్డుకున్నామని, ఒక ఇరాన్ మిసైల్ అసలు లక్ష్యాన్నే చేరుకోలేదని చెప్పారు. ఇక తమ సిబ్బందికి ఎలాంటి నష్టం జరగలేదని కూడా అన్నారు. యూఎస్ 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం ఇరాన్ దాడుల్లో దెబ్బతిందన్న వార్తలను కూడా తోసిపుచ్చారు.

ఇక ఇరాన్ రాడార్ వ్యవస్థలను అమెరికా శుక్రవారం ధ్వంసం చేసింది. వాటితో ప్రాంతీయ భద్రతకు ముప్పు ఉందని పేర్కొంది. ఇరాన్ డ్రోన్‌లను అడ్డుకున్నామని కూడా అమెరికా పేర్కొంది. హిందూ మహాసముద్రంలో ఒక ఇరాన్ నౌకను కూడా అడ్డుకున్నట్టు చెప్పింది. చమురు ఎగుమతితో లాభపడతామనుకున్న ఇరాన్ ప్రయత్నాలకు చెక్ పెట్టామని తెలిపింది.

## నగరంలో మరో అగ్నిప్రమాదం.. ఫోమ్ అండ్ ఫర్నిచర్ దగ్ధం

హైదరాబాద్, జూన్ 6: నగరంలోని మరో ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని మహబూబ్ కాలనీ లో ఉన్న మెయిన్ ఇంటీరియర్ ఫోమ్ అండ్ ఫర్నిచర్ గోదాంలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న టప్పాచబుత్రా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టారు.హైదరాబాద్ వార్తలు

ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోయినా గోదాంలోని ఫర్నిచర్, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమై భారీ ఆస్తి నష్టం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

## కేరళలో భారీ వర్షాలు.. ఒకరు మృతి.. రెడ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ

హైదరాబాద్, జూన్ 6: కేరళలో భారీ వర్షాలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. అనేక జిల్లాల్లో ఇండ్లు ధ్వంసం కాగా, రోడ్లు నీట మునిగాయి. భారీ వర్షాల కారణంగా ఒకరు మరణించారు. ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ మేరకు మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసర్‌గాడ్ జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. అలాగే, పతనాం థిట్ట, కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి, త్రిశూర్, పాలక్కాడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

రెడ్ అలర్ట్ ప్రకారం రాబోయే 24 గంటల్లో ఆయా జిల్లాల్లో 20 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఆరెంజ్ అలర్ట్ ప్రకారం 11 నుంచి 20 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు చోట్ల రోడ్లు నీట మునిగాయి. చాలా చోట్ల ఇండ్లు, ఇతర ఆస్తులు ధ్వంసమయ్యాయి. దీంతో చాలా జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. ఒక తాత్కాలిక షెడ్‌పై చెట్టు పడటంతో అందులో నిద్రిస్తున్న 29 ఏళ్ల యువకుడు మరణించాడు. ఈ ఘటన త్రిశూర్ జిల్లాలోని మనలూర్ వద్ద జరిగింది. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వరుసగా వర్షాల నేపథ్యంలో కేరళలోని పర్యాటక ప్రాంతాల్లో అధికారులు పలు ఆంక్షలు విధించారు. పర్వత ప్రాంతాల్లోకి ట్రెకింగ్ నిషేధించారు.

ఏ ొా్య ట క ొ ం ల ం కొండప్రాంతాల్ని వీడాలని, రాత్రి ప్రయాణాల్ని మానుకోవాలని సూచించారు. వయనాడ్, కోజికోడ్, కాసర్‌గాడ్ ప్రాంతాల్లో పలు ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయని, దీని కారణంగా గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడులో వర్షాలు కురుస్తున్నాయని ఐఎండీ తెలిపింది. ఉత్తర కేరళ ప్రాంతంలో సైక్లోన్ ప్రభావం కూడా ఉంటుందని తెలిపింది. ఈ నెల వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని, వేగంగా గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరించింది.

## కష్టపడి పని చేసే వారికే పార్టీలో సముచిత స్థానం
### -మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, జూన్ 6:ఈ నెల 14 న ఖైరతాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నామని.. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అధ్యక్షతన జరిగిన ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమావేశానికి మాజీమంత్రి, అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులు తెలంగాణ భవన్‌లో జరిగిన ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశానికి తలసాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించేలా బూత్ లెవెల్ ఏజెంట్లు బాధ్యతగా భావించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసిందా.. అని ప్రజలను అడగాలని నిర్దేశించారు.

పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుంది. అంకిత భావంతో కష్టపడి పని చేసే వారికే పార్టీలో సముచిత స్థానం, గుర్తింపు లభిస్తాయన్నారు తలసాని శ్రీనివాస్ యాదవ్. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ నాయకత్వం లో అద్భుతంగా అభివృద్ధి చేసుకున్నాం.

పార్టీ నాయకులు, కార్యకర్తల గౌరవాన్ని పెంచిన గులాబీ జెండా పార్టీ నుండి వెళ్లిపోయిన వారిని ఎట్టి పరిస్థితి లో తిరిగి పార్టీలోకి రానిచ్చేది లేదని స్పష్టం చేశారు.

పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని.. మోసాలు, అబద్దాలకు పెట్టింది పేరు కాంగ్రెస్ పార్టీ. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే ముఖ్యమంత్రి పండబెట్టి తొక్కుతా అంటున్నాడు. కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలో 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసింది.. ఏం చేశారని అప్పులు చేశారు. కాంగ్రెస్ పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయి నానా తిట్లు తిడుతున్నారు.కాంగ్రెస్ పోవాలి కేసీఆర్ రావాలి అని ప్రజలు కోరుకుంటున్నారు. రెండున్నర సంవత్సరాల తర్వాత తిరిగి అధికారంలోకి వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.జీహెచ్ఎంసీ ఎన్నికలు వచ్చినా, ఎమ్మెల్యే ఎన్నికలు, ఏ ఎన్నికలు వచ్చినా ఎగిరేది గులాబీ జెండానే అని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం.. చల్లబడ్డ వాతావరణం

హైదరాబాద్, జూన్ 6:కొన్ని రోజులుగా ఉక్కపోతతో సతమతమైన నగర ప్రజలకు శనివారం సాయంత్రం కురిసిన వర్షం తో ఉపశమనం లభించింది. నగరంలోని గచ్చిబౌలి, మియాపూర్, మాదాపూర్, బంజారాహిల్స్ జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బోరబండ, యూసుఫ్ గూడ, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్, హైదర్‌గూడ, ఉప్పరపల్లి, చందానగర్, లింగంపల్లి , ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. దాదాపు గంటలకు పైగా వర్షం పడడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది . రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

## పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు.. మంత్రి సీతక్క వార్నింగ్



హైదరాబాద్, జూన్ 6: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్ అధికారులతో మంత్రి సీతక్క ఈరోజు (శనివారం) సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు. మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు.8 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఆదేశించారు.

ఇవి మహిళల ఆత్మగౌరవ భవనాలని అభివర్ణించారు. ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారుల నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధనకు అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

## లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం: మహేశ్ గౌడ్

హైదరాబాద్, జూన్ 6: నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని చేతగాని తనం వల్ల లక్షలాది విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాట మాడుతోందని మండిపడ్డారు. నీట్ పరీక్ష వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు నెలల తరబడి కష్టపడి సిద్ధమైతే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి శ్రమ వృధా అయ్యిందని మహేశ్ అన్నారు. నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారాన్ని వేస్తూ ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వయనాడ్‌లో 150 మంది విద్యార్థులకు అస్వస్థత.. ఆసుపత్రిలో చేరిన 38 మంది



తిరువనంతపురం, జూన్ 6: కేరళంలోని వయనాడ్ జిల్లాలో ఒక పాఠశాలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కొద్ది రోజులుగా జ్వరం, వాంతులు బారిన పడటంతో 38 మందిని సుల్తాన్ బత్తేరి తాలూక్ ఆసుపత్రిలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

మార్ బాసిలియోస్ ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూలులో చదువుతున్న విద్యార్థుల్లో గత మూడు రోజులుగా జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనవిస్తున్నాయని, వ్యాధికి కచ్చితమైన కారణం ఇంకా తెలియలేదని అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి వ్యాధి మరింత విస్తరించకుండా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు.

కాగా, పెద్ద సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో అధికారులు ముందస్తు చర్యగా పాఠశాలకు వారం రోజులు సెలవు ప్రకటించారు. దీనిపై జిల్లా వైద్య అధికారి మాట్లాడుతూ, విద్యార్థుల తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు ఆందోళన చెందవద్దని, పరిస్థితి అదుపులోనే ఉందని చెప్పారు. విద్యార్థుల్లో ఎక్కువ మంది చికిత్సకు స్పందిస్తున్నారని, పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. విద్యార్థుల శాంపిల్స్ సేకరించి లాబొరేటరీకి పంపినట్టు చెప్పారు. ఆహారం, తాగునీటి కారణంగా వైరల్ ఇన్ఫెక్షన్ సోకిందా, ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనేది పరీక్షల్లో నిర్ధారణవుతుందని తెలిపారు. పంచాయతీ ప్రతినిధులు కూడా ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థుల పరిస్థితి సంతృప్తికరంగానే ఉందని, ఆరోగ్యం బాగా క్షీణిస్తున్న లక్షణాలేవీ లేవని చెప్పారు.

## బొగ్గు కొరతపై క్లారిటీ ఇచ్చిన సింగరేణి..

హైదరాబాద్, జూన్ 6:తెలంగాణకు చెందిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రస్తుతం బొగ్గు నిల్వలు, టెండర్ విధానాలు, ఆరోపణలపై వివరణ ఇచ్చింది. ప్రస్తుతం 26.51 లక్షల టన్నుల బొగ్గు మాత్రమే అందుబాటులో ఉందని సంస్థ తెలిపింది. గత 10 సంవత్సరాల్లో ఇదే అత్యల్ప స్థాయి స్టాక్‌గా నమోదు అయినట్లు స్పష్టం చేసింది.

2014-2024 మధ్య సగటు బొగ్గు నిల్వలు సుమారు 50 లక్షల టన్నులుగా ఉన్నాయని, అయితే ప్రస్తుత తగ్గుదల అసాధారణం కాదని.. ఇది సాధారణ ఉత్పత్తి, రవాణా ప్రక్రియలో భాగమేనని సంస్థ తెలిపింది. వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ అవసరాల కోసం కనీసం 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు అవసరమని కూడా వివరించింది.

ఓవర్‌బర్డెన్ పనులకు టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసినట్లు సింగరేణి స్పష్టం చేసింది. సైట్‌ను ప్రత్యక్షంగా పరిశీలించకుండా కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేయడం, మధ్యలో నిలిపివేయడం వంటి సమస్యలు ఎదురవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

శ్రీరాంపూర్ రాఅ-2 సహా కొన్ని ప్రాజెక్టుల్లో పనులు మధ్యలో ఆగిపోవడం వల్ల సంస్థకు నష్టం వాటిల్లిందని వివరించింది. ఈ కారణంగా మే 2025 నుంచి సైట్ విజిట్ సర్టిఫికేట్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. ఇదే విధానం ఇతర ప్రభుత్వ సంస్థలు అయిన ఔఓఆఅ, ఉఓఆఅ, ఉఖఅఒలో కూడా అమల్లో ఉందని ఉదాహరణగా పేర్కొంది.

ఆరోపణలపై విచారణ

మెడికల్ బోర్డు నియామకాల్లో అక్రమాల ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ంఆః) విచారణ కొనసాగుతోందని సంస్థ తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు అరెస్టులు జరిగినట్లు, సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. అలాగే విజిలెన్స్ విభాగం కూడా అంతర్గత విచారణను కొనసాగిస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం పేర్కొంది. మొత్తం వ్యవహారంపై పూర్తి పారదర్శకతతో చర్యలు తీసుకుంటున్నామని సంస్థ స్పష్టం చేసింది.

## మహిళలు ధైర్యంగా పనిచేస్తేనే అభివృద్ధి వేగవంతం: డీజీపీ ఆనంద్

హైదరాబాద్, జూన్ 6:ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిత సాధించాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. దాని కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో స్త్రీ రైడ్స్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. 55 మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు గిగ్ వర్క్‌లో పురుషులు ఉండేవారని, ఇప్పటినుంచి మహిళలు కూడా రాబోతున్నారని తెలిపారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్ వేదికగా డీజీపీ సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడారు.

హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌కు.. మహిళా ఎస్‌హెచ్‌వో లేరని డీజీపీ ఆనంద్ వివరించారు. తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించానని ప్రస్తావించారు. ఇప్పుడు 55 మంది మహిళలు ప్యాసింజర్ రవాణా సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్, కార్గో, డెలివరీ సర్వీసెస్‌లో మహిళా డ్రైవర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పుకొచ్చారు.

# క్యాన్సర్‌ను జయించిన వారికి అండగా ఉందాం !

## (07 జూన్ "జాతీయ క్యాన్సర్ బాధితుల దినోత్సవం" సందర్భంగా)

ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి నుంచి కోలుకున్న అభాగ్యుల ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, దీర్ఘకాలిక సంరక్షణ గొడుగులు పట్టడానికి, క్యాన్సర్ వ్యాధిని జయించిన వారిని ప్రోత్సహించి సమాజంలో నిలపడానికి ప్రయత్నించే వేదికలుగా ప్రతి ఏటా జూన్ మాసం తొలి ఆదివారం, అనగా 07 జూన్ 2026 రోజు "జాతీయ క్యాన్సర్ బాధితుల దినోత్సవం (నేషనల్ క్యాన్సర్ సర్వైవర్స్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. క్యాన్సర్ బాధితుల్లో చికిత్స పొందుతున్న వారు, చికిత్సతో నయం అయిన వారు, దీర్ఘ కాలంగా బాధ పడుతున్న వారు, చివరకు చనిపోయిన వారు వస్తారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన క్షణం నుంచి ఆ రోగుల జీవితాలు భయానకంగా మారుతున్నాయి. వ్యాధిని తొలి దశలో గుర్తించడం వల్ల 90 శాతం రోగులకు పూర్తి చికిత్స జరుగుతున్నది. చికిత్స పొంది బయట పడిన వారు చాలా తక్కువ సంఖ్యలో ఉంటారు.

### తొలి దశలో రోగ నిర్ధారణ ప్రధానం :

ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న మిలియన్ల క్యాన్సర్ బాధితులు పడిన వేదనలను అర్థం చేసుకుంటూ వారి భవిష్యత్తు ఆరోగ్యకర జీవితానికి దారులు చూపడం పౌర సమాజ బాధ్యత. క్యాన్సర్ నుంచి బయట పడి సాధారణ జీవితం గడపడం సులభమే అంటూ బాధితులకు ఆత్మవిశ్వాసం నింపడం మన కనీస కర్తవ్యం. క్యాన్సర్ వ్యాధిని తొలి దశలో నిర్ధారణ పరీక్షలతో గుర్తించడం అతి ముఖ్యం. నిర్ధారించిన వెంటనే సరైన చికిత్సను అందించి, వారికి పూర్తిగా నయం చేయవలసిన బాధ్యత వైద్యులకే కాదు వారి కుటుంబ సభ్యులకు కూడా ఉంటుందని గమనించాలి. క్యాన్సర్ వైద్య సిబ్బంది, రోగులు లేదా బాధితులు, సంరక్షకులకు సరైన అవగాహన, అపోహలను అడ్డుకోవడం, భవిష్యత్తు పట్ల సానుకూల దృక్పథం లాంటివి కల్పించాలి. పొగాకు, ఆల్కహాల్, కుటుంబ చరిత్ర, జన్యు సంబంధం, జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఆర్థిక సామాజిక స్థితి, పర్యావరణ కాలుష్యం లాంటి కారణాలతో క్యాన్సర్ వ్యాధి సోకడం గమనిస్తున్నాం. క్యాన్సర్ బాధితుల చికిత్సలో భాగంగా సర్జరీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, కీమోథెరపీ, రేడియోషన్ థెరపీ లాంటివి అందుబాటులో ఉంటాయి.

### జాతీయ క్యాన్సర్ బాధితుల దినోత్సవం-2026 ఇతివృత్తం:

జాతీయ క్యాన్సర్ బాధితుల దినోత్సవం-2026 ఇతివృత్తంగా "క్యాన్సర్ నుంచి బయట పడి జీవించడం : బాధితులు, సంరక్షకులు, వైద్య సిబ్బంది సమన్వయాన్ని బలోపేతం చేయడం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. క్యాన్సర్ బాధితుల భవిష్యత్తుకు కమ్యూనిటీలు, వైద్య విభాగాలు ఐక్యంగా ముందుకు సాగాలి. ప్రస్తుతం భారతదేశవ్యాప్తంగా 2.5 మిలియన్ల క్యాన్సర్ బాధితులు ఉండగా, ప్రతి ఏటా 7 లక్షలకు పైగా ఆ జాబితాలో చేరుతుండగా, దాదాపు 5.6 లక్షల రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. బాధితుల్లో దాదాపు 71 శాతం మంది వయస్సు 30 - 69 ఏండ్ల మధ్య ఉండగా, సాలీనా వీరిలో 4 లక్షల మంది చనిపోతున్నారు. భారతీయ పురుషుల్లో అధిపతులు నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారు. సర్వైకల్ క్యాన్సర్ బాధితులు సగటున 49 శాతం మంది ఐదు ఏండ్ల పాటు బతుకుతున్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా నమోదు అవుతున్నాయి. పొగాకు సంబంధ క్యాన్సర్లు కూడా అధికంగా నమోదు అవుతున్నట్లు విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. రొమ్ము క్యాన్సర్ బాధితుల్లో పట్టణ మహిళలు అధికంగా ఉండడం విశేషం.

1988లో ప్రారంభమై నేడు 39వ వార్షికోత్సవం జరుపుకుంటున్న జాతీయ క్యాన్సర్ బాధితుల దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ బాధితులకు మాత్రమే కాకుండా వారి సంరక్షకులకు కూడా ఆసుపత్రులు, క్యాన్యర్ కేంద్రాలు, సామాజిక సమావేశాల్లో అవగాహన, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, రోగులకు బాసటగా నిలవడం, ధైర్యాన్ని నూరిపోయడం కొనసాగుతుంది.



-మధుపాలీ
9949700037

# ప్రకృతి సంరక్షణకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలని చాటిచెప్పే సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, జూన్ 6:ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఈ రోజు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ సంరక్షణ పట్ల మక్కువను కనబరిచే వారందరినీ ఆయన ప్రశంసించారు.

పర్యావరణ సంరక్షణనీ, సుస్థిరాభివృద్ధినీ ప్రోత్సహించడానికి నిబద్ధతను పునరుద్ఘాటించే రోజు ఈ రోజు అని ప్రధానమంత్రి అన్నారు. గత పది సంవత్సరాలుగా ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలను ఆయన ప్రస్తావిస్తూ, ఆ చర్యలతో.. మొక్కలను పెంచుతున్న ప్రాంతాల సంఖ్యతో పాటు , అనేక పశు జాతులు కూడా పెరిగాయన్నారు.

ఉమ్మడి ప్రయత్నాలు, పటిష్ఠ విధానాలు, విజ్ఞానశాస్త్రం పట్ల నమ్మకం, నూతన ఆవిష్కరణలతో పర్యావరణంలో చెప్పుకోదగిన మెరుగుదలను తీసుకురావచ్చని దేశ ప్రజలు నిరూపించారని శ్రీ మోదీ అన్నారు.

భారత్‌లో జీవ వైవిధ్యం దేశానికి అమిత గర్వకారణమని ప్రధానమంత్రి చెబుతూ, ఈ జీవ వైవిధ్యం విభిన్న విస్తారిత అనుబంధ వ్యవస్థల రూపేణా లెక్కపెట్టలేనన్ని జాతులకూ, జీవనోపాధులకూ దన్నుగా నిలుస్తోందని తెలిపారు.

కొన్ని ప్రత్యేక జాతుల పునరుద్ధరణలో చోటుచేసుకున్న విశేష ప్రగతిని శ్రీ మోదీ ప్రస్తావించారు. బట్టమేక పక్షి (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్), మంచు ప్రాంతాల్లో కనిపించే చిరుతలు, ఎలుగుబంట్లు (స్లాత్ బేర్లు), చీతాల సంరక్షణకు చేస్తున్న ప్రయత్నాలు నిరంతర కృషితో వన్యప్రాణులతో పాటు విస్తారిత అనుబంధ వ్యవస్థలను పునరుద్ధరించడంలో ఏ మేరకు తోడ్పడగలవో చాటిచెబుతున్నాయని ప్రధానమంత్రి వివరించారు.

'ఏక్ పేడ్ మా కే నామ్' (తల్లి పేరిట ఒక మొక్కను పెంచుదాం) వంటి కార్యక్రమాలు ప్రతి ఏటా దాదాపు లక్షా పది వేల హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని కొత్తగా జతపరచడంలో గొప్ప తోడ్పాటును అందించాయని ప్రధానమంత్రి తెలిపారు.

'వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ అండ్ వన్ ఫ్యూచర్' (ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకటే భవిష్యత్తు) సిద్ధాంతాన్ని భారత్ మార్గదర్శకంగా తీసుకొని స్వచ్ఛమైన, పచ్చదనంతో నిండివుండే, మరింత ఎక్కువ కాలం పాటు మనుగడలో ఉండేలా ఈ భూగ్రహాన్ని సంరక్షించే దిశగా నిరంతరం పాటుపడుతుందని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

సాంస్కృతిక భావన భారతదేశ సాంప్రదాయిక జ్ఞానంలో ఎంతో అందంగా ప్రతిబింబిస్తోందని ప్రధానమంత్రి అన్నారు. పర్యావరణాన్ని సంరక్షించాలన్న సందేశాన్ని పరిపుష్టం చేసే ఉద్దేశంతో ఓ సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో ఆయన పంచుకున్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో వరుస సందేశాలను ప్రధానమంత్రి పొందుపరుస్తూ"ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. పర్యావరణాన్ని సంరక్షించుకోవాలని మక్కువను చూపే వారందరినీ నేను ప్రశంసలు తెలియజేయదలుస్తున్నాను. ఈ రోజు మన పర్యావరణాన్ని సంరక్షించుకొంటామనీ, మానవ జాతి దీర్ఘకాలం మనుగడ సాగించేందుకు అనువైన విధంగా అభివృద్ధి బాటలో నడుస్తామనీ మనకున్న నిబద్ధతను పునరుద్ఘాటించాల్సిన రోజు. గత పది సంవత్సరాలుగా మా ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలు ఈ దిశగా వేం చేసిన కృషిని వెల్లడిస్తున్నాయి. భారత్ సాధించిన కీలక విజయాల్లో .. మొక్కలను పెంచుతున్న ప్రాంతాలను విస్తరించడంతో పాటు అనేక పశు జాతుల జనసంఖ్యలో నమోదైన వృద్ధి వంటివి ఉన్నాయి. ఉమ్మడి ప్రయత్నాలు, విధానాలు, సైన్సు, నూతన ఆవిష్కరణల పట్ల నమ్మకం మన పర్యావరణాన్ని మెరుగుపరచగలుగుతాయని భారతదేశ ప్రజలు చాటారు".

"మన జీవ వైవిధ్యాన్ని చూసుకొని భారత్ ప్రజలం చాలా గర్వపడుతున్నాం. మన విభిన్న విస్తారిత అనుబంధ వ్యవస్థలు అసంఖ్యాక జాతులకీ, జీవనోపాధులకీ ఊతాన్ని అందిస్తున్నాయి. విశేష సంరక్షణ రంగంలో మన ప్రయత్నాలు కూడా ప్రశంసనీయంగా ఉన్నాయి. బట్టమేక పక్షి (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్), హిమ ప్రాంత చిరుతలు, ఎలుగుబంట్లు (స్లాత్ బేర్లు), చీతాలను సంరక్షించే దిశగా చేపట్టిన ప్రయత్నాలు.. నిరంతర నిబద్ధతతో నడుచుకున్నప్పుడు వన్యప్రాణులతో పాటు విస్తారిత అనుబంధ వ్యవస్థల పునరుద్ధరణలో తోడ్పడగలుగుతాయని చాటాయి. 'ఏక్ పేడ్ మా కే నామ్' వంటి కార్యక్రమాలు ప్రతి సంవత్సరం ఇంచుమించు 1.19 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతాలను జోడించడంలో కీలక పాత్రను పోషించాయి".

"ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకటే భవిష్యత్తు" సిద్ధాంతం మార్గదర్శకత్వం వహిస్తుండగా, మిషన్ లైఫ్ (ఓతిబబతినీని ఒతిఈఇ) భావన ద్వారా స్వచ్ఛమైన, పచ్చదనంతో నిండివుండే, మరింత ఎక్కువ కాలం పాటు మనుగడ సాగించేలా ఈ భూగ్రహాన్ని సంరక్షించే దిశగా నిరంతరం పాటుపడడాన్ని కొనసాగించుదాం".

ప్రకృతిని సంరక్షించడం ఒక బాధ్యతే కాక, మన సంస్కృతి, సంస్కారం నుంచి విడదీయలేని భాగం కూడా.

మధు వాతా రుతాయతే మధు క్షరన్తి సిన్ధవః
మాధ్వీర్నః సన్త్వోషధీః" అని పేర్కొన్నారు.

ఈ సంస్కృత సుభాషితానికి.. మన చుట్టుపక్కల గాలి ఆహ్లాదకరంగా, మనకు మేలు కలిగించేదిగా ఉండుగాక. నదులు జీవనదాయినులై, పౌష్టిక జలాలను అందించుగాక. మందులను తయారు చేయడానికి ఉపయోగించే మొక్కలు అన్ని ప్రాణులకూ ఆరోగ్యాన్నీ, సంక్షేమాన్నీ ప్రసాదించుగాక అని అర్థం.

# భారత డిజిటల్ మౌలిక సదుపాయాలు అద్భుతమైన వేగంతో పురోగమిస్తున్నాయన్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, జూన్ 6:భారతదేశ డిజిటల్ మౌలిక సదుపా యాల ప్రయాణం అద్భుతమైన వేగంతో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు అన్నారు. భారత్‌లో దాదాపు రూ. 3 లక్షల కోట్లు (30 బిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టటంతో పాటు 5 గిగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లను అభివృద్ధి చేయనున్నట్లు ఎయిర్‌ట్రంక్ సంస్థ ప్రకటించిన విషయాన్ని ప్రధాని ప్రస్తావించారు. దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల విషయంలో రాబోతున్న అతిపెద్ద పెట్టుబడుల్లో ఇది ఒకటిగా ఆయన అన్నారు.

ఇలాంటి పెట్టుబడులు క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ రంగాల్లో ప్రపంచ కేంద్రంగా భారతదేశ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తాయని ప్రధాని పేర్కొన్నారు. ఇది ఒకేసారి పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు స్థానిక సరఫరా గొలుసులను బలోపేతం చేస్తుందని, ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని వేగవంతం చేస్తుందని ఆయన ఉద్ఘాటించారు. ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తును భారతదేశమే ఎక్కువగా ప్రభావితం చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ప్రధానమంత్రి ఈ విధంగా పేర్కొన్నారు:

"భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణం అద్భుత మైన వేగంతో ముందుకు సాగుతోంది.

మన దేశంలో దాదాపు రూ. 3 లక్షల కోట్ల (30 బిలియన్ డాలర్ల) పెట్టుబడి పెట్టటంతో పాటు 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లను అభివృద్ధి చేయనున్నట్లు ఎయిర్‌ట్రంక్ సంస్థ ప్రకటించింది. దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల వ్యవస్థలో రాబోతున్న అతిపెద్ద పెట్టుబడుల్లో ఇది ఒకటి.

ఇలాంటి పెట్టుబడులు క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ రంగాల్లో ప్రపంచ కేంద్రంగా భారతదేశ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తాయి. ఇవి ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి.. స్థానిక సరఫరా గొలుసులకు అండగా నిలుస్తాయి.. ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని వేగవంతం చేస్తాయి.ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు భారతదేశంలోనే ఎక్కువగా రూపుదిద్దుకుం టోందనేది ఇప్పుడు స్పష్టమవుతోంది."

# స్పోర్ట్స్ సిటీగా విజయవాడ తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం

**క్రీడల అభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తాం**
**ఆధునికరణతో ఇండోర్ స్టేడియంను రాష్ట్రంలోనే ఆదర్శ క్రీడా వేదికగా మారుస్తాం**
**విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**




విజయవాడ, జూన్ 6: భవిష్యత్తులో విజయవాడను రాష్ట్రంలోనే ప్రముఖ స్పోర్ట్స్ సిటీగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. క్రీడల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. విజయవాడ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాదనీ క్రీడల్లోనూ విజయవాడకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం అనీ యువత కలలను సాకారం చేసే స్పోర్ట్స్ హబ్‌గా విజయవాడను తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) స్పష్టం చేశారు.

శనివారం విజయవాడ లోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్?2026 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ, క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వ్యక్తిత్వ వికాసంలో క్రీడల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విజయవాడలోని యువ క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించేందుకు అత్యుత్తమ క్రీడా వసతులు అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించినట్లు తెలిపారు. పీవీ సింధు స్థాయి క్రీడాకారులు మాత్రమే కాదనీ ఆమె స్ఫూర్తితో మన గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రపంచ వేదికలపై భారత జెండాను రెపరెపలాడించే ప్రతిభావంతులు వెలుగులోకి రావాలన్నారు.

వారికి కావాల్సిన వేదికలు, శిక్షణా సదుపాయాలు, ప్రోత్సాహం అందించడం మన బాధ్యత అని ఎంపీ పిలుపునిచ్చారు. బ్యాడ్మింటన్ రంగంలో చేతన్ ఆనంద్, పీ.వి.వి. లక్ష్మి, రుత్వికా శివాని, మేఘనా జక్కంపూడి, సూర్య చరిష్మ వంటి ప్రతిభావంతులను అందించిన విజయవాడ, రాబోయే రోజుల్లో మరింత మంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను దేశానికి అందించే కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇండోర్ స్టేడియాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి, క్రీడాకారులు అత్యుత్తమ వాతావరణంలో సాధన చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రీడలకు సంబంధించిన మౌలిక వసతుల విస్తరణ, శిక్షణా సదుపాయాల మెరుగుదల, యువ ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపుతూ ఎంపీ స్వయంగా బ్యాడ్మింటన్ ఆడి వారిని అభినందించారు. పోటీల నిర్వహణలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడాకారులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు.

# రివ్యూలతో కాదు.. వనరులతోనే రెవెన్యూ శాఖ బలోపేతం

**ప్రత్యేక రెవెన్యూ అకాడమీ ఏర్పాటు చేయాలని ఏపీఆర్ఎస్ఏ డిమాండ్**
**సర్ రీ సర్వే, పాసుపుస్తకాల పంపిణీ సమన్వయంతో నిర్వహించాలన్న సూచన**
**పెండింగ్ తహశీల్దార్ పదోన్నతుల పరిష్కారానికి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు కృతజ్ఞతలు**
**-రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కీలక తీర్మానాలు**

విజయవాడ, జూన్ 6:రెవెన్యూ శాఖను బలోపేతం చేయాలంటే కేవలం సమీక్ష సమావేశాలు నిర్వహించడం సరిపోదని, కార్యాలయాలకు తగిన సిబ్బంది, నిధులు, మౌలిక వసతులు, నిరంతర శిక్షణ కల్పించడం ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) స్పష్టం చేసింది. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు పలు కీలక తీర్మానాలు ఆమోదించారు.

ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొని రెవెన్యూ శాఖ ఎదుర్కొంటున్న సవాళ్లు, ఉద్యోగుల సమస్యలు, పరిపాలనా అంశాలపై విస్తృతంగా చర్చించారు.

గత నాలుగేళ్లుగా కోర్టు కేసుల కారణంగా నిలిచిపోయిన తహశీల్దార్ పదోన్నతుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. సాయిప్రసాద్, సీసీఎల్ఏ జి. జయలక్ష్మిలకు సమావేశం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. దాదాపు 300 మంది అధికారులకు పదోన్నతులు కల్పించడం ద్వారా రెవెన్యూ ఉద్యోగుల్లో నూతనోత్సాహం నింపారని పేర్కొంది.భారత ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ , రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రీ సర్వే, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాలు ఒకేసారి అమల వుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులపై తీవ్రమైన పనిభారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమాలు ఒకదానితో మరొకటి ఓవర్‌ల్యాప్ కాకుండా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.

కోర్టు ధిక్కరణ కేసుల విచారణలకు తరచూ హాజరుకావాల్సి వస్తున్న రెవెన్యూ ఉద్యోగులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని సమావేశం పేర్కొంది. ప్రభుత్వ విధుల నిర్వహణలో భాగంగా ఎదురవుతున్న ఈ ఖర్చులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేసింది. అలాగే తహశీల్దార్,




ఆర్డీఓ కార్యాలయాల నిర్వహణకు ప్రస్తుతం కేటాయిస్తున్న నిధులు ఏమాత్రం సరిపోవడం లేదని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా బడ్జెట్‌ను పెంచాలని కోరింది.

రెవెన్యూ చట్టాలు, భూ పరిపాలన, రీ సర్వే, డిజిటల్ ల్యాండ్ మేనేజ్‌మెంట్, ఎన్నికల విధులు, న్యాయపరమైన అంశాల్లో ఉద్యోగులకు నిరంతర శిక్షణ అందించేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక "రెవెన్యూ అకాడమీ" ఏర్పాటు చేయాలని సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించవచ్చని అభిప్రాయ పడింది.

సమావేశంలో అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక తహశీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 234 తహశీల్దార్ కార్యాలయాలకు మరమ్మతులు అవసరమని, 160 కార్యాలయాలకు కొత్త భవనాలు అవసరమని, 35 ఆర్డీఓ కార్యాలయాలు నిర్మించాల్సి ఉండగా, 21 కార్యాలయాలకు మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. కనీస మౌలిక సదుపాయాలు, పని వాతావరణం లేకుండా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడం కష్టమని పేర్కొన్నారు.రాష్ట్ర అభివృద్ధి, భూ పరిపాలన, సంక్షేమ పథకాల అమలులో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తున్నందున ఉద్యోగుల సమస్యలు, మౌలిక అవసరాలు, శిక్షణ, పరిపాలనా మద్దతుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశం తీర్మానించింది.

# మహిళల, బాలబాలికల భద్రత అవగాహన కార్యక్రమం

విజయవాడ జూన్ 6: విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు ఉత్తర్వుల ప్రకారం వెస్ట్ డి.సి.పి జి. రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం కొత్తపేట కె.బి.ఎన్ కాలేజీ ఆడిటోరియంలో క్రైం ఎగనెస్ట్ ఉమెన్ అండ్ చైల్డ్, బి.ఎన్.ఎస్ యాక్ట్, సైబర్ క్రైమ్ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి జి రామకృష్ణ సమాజంలో మహిళల పై జరుగుతున్న నేరాలు వాటిని అరికట్టడానికి తీసుకోవలసిన చర్యలు వివరించారు. మోటార్ సైకిల్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్‌ను వాహనం నడిపే ప్రతి వ్యక్తి కలిగి ఉండాలని అన్నారు.

ఈ సందర్భంగా విజయవాడ సిటి మహిళా పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ వాసవి భారతీయ న్యాయ సంహిత, వరకట్న నిషేధం చట్టం ఫోక్సో చట్టం పై అవగాహన కల్పించారు. అనవసరం విషయాల్లో తల దూర్చి విద్యార్థి విద్యార్థినీలు వారి భవిష్యత్తు ని నాశనం చేసుకోవద్దని అన్నారు, మైనర్ గర్ల్ ప్రేమిస్తున్నానని చెప్పినా కూడా ఆమె సమ్మతి చెల్లదని అన్నారు, మైనర్ గర్ల్స్‌తో అసభ్యంగా ప్రవర్తించడం కూడా ఫోక్సో చట్టం క్రింద నేరమని తెలిపారు. సమాజములో స్త్రీలను గౌరవించి వారితో సోదర భావముతో మెలగాలని సూచించారు. విజయవాడ సిటి సైబర్ క్రైమ్ ఉమెన్ సబ్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇందులో ఆన్లైన్లో వివిధ యాప్ ల ద్వారా పరిచయం లేని వ్యక్తులు సులువుగా డబ్బులు సంపాదించవచ్చని లేదా ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రలోభ పెట్టి డబ్బులు దోచుకుంటున్నారన్నారు.

దాని నుండి తప్పించుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు.

ఇంటర్నెట్ ను అసాంఘిక కార్యక్రమాలకు వినియోగించకుండా సక్రమంగా వినియోగించాలని సూచించారు. అశ్లీల చిత్రాలు, అసభ్య పద జాలాలు కలిగిన సమాచారముని ఇంటర్నెట్ లో పోస్ట్ చేయడం వంటివి చేయరాదని అన్నారు. దాని పై తీసుకునే చట్టపరమైన చర్యలు వలన భవిష్యత్తు పాడు చేసుకోవద్దని అన్నారు. వాట్సాప్ ఇన్స్టాగ్రామ్, ఆన్లైన్ లో వచ్చే తెలియని ఫైల్స్ ను ఓపెన్ చేసి తద్వారా మోసపోకూడదని తెలియజేశారు.టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఎస్ చిన్న కొండల రావు మహిళల పై సమాజంలో జరుగుతున్నా నేరాలు, వాటిని అరికట్టడానికి తీసుకోవలసిన చర్యలు వివరించారు. యువత మత్తు పదార్ధాలకు అనగా గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి అలవాటు పడి భవిష్యత్తు నాశనము చేసుకోవద్దని సూచించారు,

ప్రతి ఒక్కరూ మత్తు పదార్ధాలకు దూరముగా ఉంటామని ప్రతిజ్ఞబూనాలని అన్నారు, మన సమాజాన్ని మత్తు పదార్ధ రహిత సమాజం గా మార్చడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని, మత్తుపదార్ధాల విక్రయం, రవాణా గురించి ఏ సమాచారము తెలిసిన యెడల పోలీసు వారికి తెలియపరచి శాంతి భద్రతల పరిరక్షణ లో పోలీసు వారికి సహకరించాలని, అలాగే డ్రగ్స్ రహిత సమాజం గా మార్చడానికి, ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు చేపట్టిన డ్రగ్స్ పై దండయాత్ర కార్యక్రమాన్ని గుర్తు చేశారు.

# వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలితో చర్చించిన హర్‌దీప్ సింగ్ పూరీ

న్యూఢిల్లీ, జూన్ 6:గౌరవ వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ ఎలోయినా రోడ్రిగ్జ్ గోమెజ్‌తో భారత కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి శ్రీ హర్‌దీప్ సింగ్ పూరీ 2026 జూన్ 4న న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, వివిధ ప్రభుత్వ రంగ చమురు కంపెనీల చైర్‌పర్సన్లతో కలిసి మంత్రి ఆమెతో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య శాశ్వత ఇంధన భాగస్వామ్యాన్ని నిర్మించుకునే అవకాశాలపై వారిద్దరూ చర్చించారు.

దీర్ఘకాలిక స్నేహసంబంధం ప్రాతిపదికగా భారత్, వెనిజువెలా మధ్య ఒక సహజసిద్ధమైన భాగస్వామ్యం నెలకొన్నదని ఈ సమావేశంలో మంత్రి పేర్కొన్నారు. వెనిజువెలా ఇంధన రంగ పునర్నిర్మాణానికి భారత్ బలంగా మద్దతిస్తుందని ఆయన స్పష్టం చేశారు. వెనిజువెలాలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించడానికి భారతీయ కంపెనీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. భారత ఇంధన వైవిధ్యీకరణ వ్యూహంలో వెనిజువెలా కీలక పాత్ర పోషిస్తుందన్న మంత్రి.. ఆ దేశంతో ఇంధన వాణిజ్యాన్ని మరింత విస్తరించుకునేందుకు భారత్ ఎంతో ఆసక్తితో ఉందని వెల్లడించారు.

భారత్‌ను వెనిజువెలాకు నమ్మకమైన భాగస్వామిగా పేర్కొంటూ.. తమ దేశంలో సంస్కరణలు చేపట్టిన చమురు, గ్యాస్ రంగంలో క్రియాశీలక భాగస్వాములు కావాల్సిందిగా భారతీయ కంపెనీలకు తాత్కాలిక అధ్యక్షురాలు ఆహ్వానం పలికారు. ఇంధన రంగంలో భారత్ - వెనిజువెలా మధ్య ఉన్న పరస్పర అనుకూలతలను ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇరు దేశాల మధ్య మరింత బలమైన సహకారం దిశగా అవకాశాలను అన్వేషించడం కోసం ఒక ఉన్నత స్థాయి భారత ప్రతినిధి బృందం వెనిజువెలాలో పర్యటించాలని ఈ సందర్భంగా ఆమె ఆహ్వానించారు.

నేపథ్యం

ప్రపంచంలో అత్యధికంగా చమురు నిల్వలున్న దేశం వెనిజువెలా. ఏళ్లుగా భారత్‌కు ముడిచమురును సరఫరా చేస్తోంది. వెనిజువెలా నుంచి వచ్చే భార ముడిచమురును శుద్ధి చేసే ప్రత్యేక సాంకేతిక సామర్థ్యం భారత అత్యాధునిక రిఫైనరీ రంగానికి ఉంది. భౌగోళిక రాజకీయ పరిస్థితులు, సరఫరాలో ఆటంకాలు గల్ఫ్ దేశాల నుంచి ముడిచమురు దిగుమతులను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో.. ఇంధన దిగుమతి వనరుల వైవిధ్యీకరణలో వెనిజువెలాను వ్యూహాత్మక భాగస్వామిగా భారత్ పరిగణిస్తోంది. 2026 ఏప్రిల్, మే నెలల్లో భారత్‌కు అత్యధికంగా ముడిచమురును సరఫరా చేసిన దేశాల్లో వెనిజువెలా ఒకటిగా నిలిచింది. భవిష్యత్తులో ఈ దిశగా ఇరు దేశాల సంబంధాల విస్తరణకు విస్తృత అవకాశాలున్నాయనేందుకు ఇది నిదర్శనం. 2025-26లో వెనిజువెలా నుంచి భారత్ సగటు నెలవారీ దిగుమతులు 64.027 టీఎంటీలుగా ఉండగా.. 2026-27 ఏప్రిల్ - మే నాటికి అది 1,047.148 టీఎంటీలకు పెరిగింది.

వెనిజువెలా చమురు అన్వేషణ, ఉత్పత్తి రంగంలో కూడా భారత ప్రభుత్వ రంగ సంస్థలు 2008 నుంచే సుస్థిరంగా కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ఆ సంస్థల దీర్ఘకాలిక నిబద్ధతకు ఇది నిదర్శనం.

ఒరినోకో బెల్ట్‌లో ఉన్న శాన్ క్రిస్టోబల్, పెట్రోకారాబోబో-1 ప్రాజెక్టుల్లో.. వెనిజువెలా చమురు రంగంలో భారత్ మొత్తం పెట్టుబడి దాదాపు 1 బిలియన్ డాలర్లుగా ఉంది.

# విద్యా ప్రతిభకు బలిజ సంఘం ప్రోత్సాహం

-120 మంది విద్యార్థులకు నగదు బహుమతులు.
-మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా సన్మానాలు.
-ప్రతిభను గుర్తించే బలిజ సంఘం ప్రత్యేక కార్యక్రమం
-విద్యార్థులు, ఉద్యోగులకు ఒకే వేదికపై ఘన సత్కారం




కర్నూలు, జూన్ 6: విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలనే ఉద్దేశంతో కర్నూలు నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానిక బి.క్యాంప్‌లోని కాపు భవన్‌లో జరగనున్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ తదితర కోర్సుల్లో విశేష మార్కులు సాధించిన సుమారు 120 మంది బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు అందజేయనున్నట్లు కర్నూలు నగర బలిజ సంఘం అధ్యక్షుడు లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు.

శనివారం ఐదు రోడ్ల కూడలిలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, విద్యా రంగంలో రాణించిన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో విద్యా చైతన్యం మరింత పెంపొందుతుందని చెప్పారు.

విద్యార్థుల సన్మానంతో పాటు ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతను, పదవీ విరమణ చేసిన ఉద్యోగులను, వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులను కూడా ప్రత్యేకంగా సత్కరించనున్నట్లు వెల్లడించారు. సమాజాభివృద్ధికి కృషి చేసిన వ్యక్తులకు విశిష్ట పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

బలిజ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఈ సమావేశంలో సంఘం ప్రధాన సలహాదారు సోమశేఖర్ సింగంశెట్టి, కోశాధికారి ప్రకాష్ బాబు, ఉపాధ్యక్షులు సహదేవుడు, రామిరెడ్డి, సహాయ కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిరిగిన బ్యాగులో చెదరని విలువలు

-నగదు, పాస్పోర్ట్ చూసినా మారని మనసు
-పట్టాలపై కనిపించిన నిజాయితీ కథ
-నేపాలీ ప్రయాణికుడికి ఊరటనిచ్చిన కీమెన్



మహబూబాబాద్, జూన్ 6: రైల్వే ట్రాక్పై విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి నిజాయితీ మహబూబాబాద్లో హృదయాలను హత్తుకుంది. శనివారం మహబూబాబాద్-తాళ్లపూసపల్లి మధ్య 433 కిలోమీటర్ బార్ 3-5 పోస్ట్ వద్ద కీమెన్ పాశం వంశీకి ఓ బ్యాగ్ కనిపించింది. రైలు నుంచి పడటంతో అది చిరిగిపోయి ఉండగా అందులో నగదు, ఐఫోన్, పాస్పోర్ట్ ఉన్నట్లు గుర్తించాడు. విలువైన వస్తువులు చూసిన తర్వాత కూడా వాటిపై ఆశపడకుండా బాధ్యతగా వ్యవహరించాడు. వెంటనే మహబూబాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్కు చేరుకుని ఆర్పీఎఫ్ ఎస్ఐ సుభానికి బ్యాగ్ అప్పగించాడు.

మరోవైపు బ్యాగ్ పోగొట్టుకున్న నేపాల్కు చెందిన ప్రయాణికుడు వరంగల్లో ఫిర్యాదు చేశాడు. రైల్వే అధికారులు వివిధ స్టేషన్లలో ఆరా తీయగా బ్యాగ్ మహబూబాబాద్లో లభించినట్లు సమాచారం అందింది. దీంతో బాధితుడు వెంటనే మహబూబాబాద్ చేరుకున్నాడు. తాను తమిళనాడు ఎక్స్ప్రెస్లో ప్రయాణిస్తున్న సమయంలో బ్యాగ్ జారిపడిందని వివరించాడు.

ఎస్ఐ సుభాని సూచనతో బ్యాగ్ను తెరిచి వస్తువులను తనిఖీ చేశాడు. అందులోని నగదు, ఐఫోన్, పాస్పోర్ట్ సహా అన్ని వస్తువులు యథాతథంగా ఉండటంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అమూల్యమైన పత్రాలు తిరిగి దక్కడంతో బాధితుడు భావోద్వేగానికి గురయ్యాడు. వంశీ చేతులు పట్టుకుని కృతజ్ఞతలు తెలిపాడు. నిజాయితీకి నిలువెత్తు ఉదాహరణగా నిలిచిన వంశీని ఎస్ఐ సుభాని, రైల్వే సిబ్బంది అభినందించారు. చిన్న చర్యతో పెద్ద నమ్మకాన్ని నిలబెట్టిన ఘటనగా ఇది నిలిచిపోయింది.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

మెదక్, జూన్ 6:అనుమతి ఉన్న కంపనీల విత్తనాలు,ఎరువులు , పురుగు మందులను మాత్రమే విక్రయించాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల డీలర్లతో వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వరిలో నాణ్యమైన సన్న రకాలను ఎక్కువ మొత్తంలో అందుబాటులో ఉంచాలని సూచించారు.

విత్తనాలు, ఎరువులు,పురుగు మందుల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్‌లను నిర్వహించాలని తెలిపారు. ధరలు, స్టాక్ బోర్డులను షాపు ఎదుట ఏర్పాటు చేయాలని కోరారు. దుకాణ యజమానుల నుంచి రైతులు తప్పనిసరిగా రశీదులను తీసుకోవాలని వెల్లడించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్ట్‌ను అమలు చేస్తామని హెచ్చరించారు. అధిక ధరలకు విత్తనాలు, ఎరువుల విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని వివరించారు.

# ప్రజాసేవే కార్యకర్తల లక్ష్యం కావాలి

అమరావతి, జూన్ 6: గొడ్డలి పార్టీ ఆగడాలు హద్దులు దాటితే సహించబోమని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. ఎన్టీఆర్ భవన్‌లో శిక్షణ పొందుతున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో సమావేశమైన సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు కీలక సూచనలు చేశారు.

పార్టీకి ఓటమి రాకుండా అన్ని స్థాయిల్లో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు మరింత కృషి చేయాలని, ప్రజల మధ్య ఉండి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

కార్యకర్తలు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా ప్రజలకు మేలు చేసే నాయకులుగా ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నందున మరింత సహనం, ఓపికతో వ్యవహరించాలని సూచించారు.

పార్టీ వ్యవహారాలపై నిరంతరం సర్వేలు నిర్వహిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించే వారిని ఉపేక్షించబోమని, తప్పులు చేసిన వారిపై కఠిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# త్రుటిలో తప్పిన ఘోరం.. ఆర్టీసీ బస్సులో మంటలు.. కిటికీల నుంచి దూకిన ప్రయాణికులు

అమరావతి, జూన్ 6: ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి వద్ద ఘోర ప్రమాదం తప్పింది. జగ్గయ్యపేట నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. బస్సు గొల్లపూడి ప్రాంతానికి చేరుకోగానే ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగలు రావడాన్ని డ్రైవర్ గమనించాడు.

వెంటనే అలర్ట్ అయిన ఆయన బస్సును రోడ్డు పక్కన ఆపి ప్రయాణికులను కిందకు దిగిపోవాల్సిందిగా గట్టిగా కేకలు వేశాడు. బస్సు తలుపు వైపు మంటలు వ్యాపించే ప్రమాదం ఉండటంతో తీవ్ర ఆందోళనలో ఉన్న ప్రయాణికులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బస్సు కిటికీల గుండా బయటకు దూకేశారు. ఒకరికొకరు సాయం [illegible] క్షణాల వ్యవధిలో బస్సు నుంచి సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజిన్లు ఘటనా స్థలానికి చేరుకుని బస్సులో చెలరేగిన మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చాయి.

ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అటు అధికారులు, ఇటు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై ఆర్టీసీ, పోలీస్ అధికారులు స్పందిస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. బస్సులో మంటలు చెలరేగడానికిగల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, ఏదైనా మెకానికల్ ఫెయిల్యూర్ లేదా షార్ట్ సర్క్యూట్ లాంటి సాంకేతిక సమస్యలవల్ల ఈ ప్రమాదం జరిగిందా.. లేదంటే మరేదైనా కారణం ఉందా.. అనే కోణంలో వాహనాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## గోవాలో విషాదం.. రోడ్డుపై చెత్త పడేసిన యువకుడు..

న్యూ ఢిల్లీ, జూన్ 6: సోషల్ మీడియా కారణంగా గోవాలో ఒక విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. రోడ్డుపై ఒక వ్యక్తి చెత్త పడేస్తుండగా వైరల్ కావడం, అతడిపై ట్రోలింగ్ జరగడం వంటి కారణాలతో కుంగిపోయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం రాత్రి జరిగినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఉత్తర గోవాలోని మాపుసాకు చెందిన సామ్యూల్ గార్విన్ డే బ్రగాన్సా అనే 2 ఏళ్ల విద్యార్థి ఇటీవల రోడ్డుపై చెత్త పడేశాడు.

దీన్ని అక్కడివారెవరో వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియో వైరల్ అయింది. పెద్ద చర్చకు దారితీసింది. సామ్యూల్‌పై ట్రోల్ జరిగింది. అందరూ అతడి చర్యను విమర్శించారు. తను చేసిన పని నిర్లక్ష్యానికి నిదర్శనం అని, అతడు చేసిన పని వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకావం ఉందని విమర్శించారు. ఈ నేపథ్యంలో సామ్యూల్‌పై మపుసా పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది.

# ఇంటి వద్దే చెత్త విభజన..

-ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు కీలకం



కర్నూలు. జూన్ 6: వ్యర్థాలను ఉత్పత్తి అయిన చోటే తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక (హానికర) వ్యర్థాలుగా వేరు చేయడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మూడో వారపు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు.

మద్దూర్‌నగర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్డీవో సందీప్తో కలిసి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ప్రతి కుటుంబం ఇంటి వద్దనే చెత్తను నాలుగు వర్గాలుగా విభజించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. చెత్తను కలిపి ఇవ్వడం వల్ల పునర్వినియోగం, శాస్త్రీయ నిర్వహణకు ఆటంకం ఏర్పడుతుందని, విభజించి ఇవ్వడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావచ్చని అన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణ నియమాల అమలుపై దృష్టి

ఈ సందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2026 పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ నిబంధనల ప్రకారం అధిక మొత్తంలో వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థలు తమ వద్దే వ్యర్థాలను ప్రాసెస్ చేసి కంపోస్టుగా మార్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

రోజుకు 100 కిలోలకుపైగా ఘన వ్యర్థాలు ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్లు, 20 వేల చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణం కలిగిన వాణిజ్య సముదాయాలు, రోజుకు 40 వేల లీటర్లకు మించి నీటిని వినియోగించే సంస్థలు ఈ నిబంధనల పరిధిలోకి వస్తాయని వివరించారు.

**వాల్‌మార్ట్‌లో వ్యర్థాల నిర్వహణ కేంద్రం పరిశీలన**

అనంతరం బిర్లా కాంపౌండ్‌లోని Walmart కేంద్రంలో ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ), తడి వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్, ప్రమాదకర వ్యర్థాల నిల్వ కేంద్రం, పునర్వినియోగ వ్యర్థాల నిల్వ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ విధానాన్ని నగరంలోని ఇతర బల్క్ వేస్ట్ జనరేటర్లు కూడా అనుసరించాలని సూచించారు.

వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక కంపోస్టింగ్ యూనిట్లు, వ్యర్థాల సేకరణ డబ్బాలు, రికార్డు నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డంప్‌యార్డులో ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీ

కలెక్టర్ గార్గేయపురం డంప్‌యార్డును సందర్శించి విండ్రో కంపోస్టింగ్ యూనిట్లు, వర్మీ కంపోస్టింగ్ యూనిట్లు, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) కేంద్రాలను పరిశీలించారు. వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించడం ద్వారా కంపోస్టు తయారీ, పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు.

అలాగే కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని కూడా సందర్శించి అక్కడి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు.

హోటళ్లు, ఫంక్షన్ హాల్స్‌కు ప్రత్యేక సూచనలు

కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్, హోటళ్లలో మిగిలిపోయే ఆహార వ్యర్థాలను మురుగునీటి కాలువల్లో వేయకుండా ప్రత్యేకంగా సేకరించి శాస్త్రీయంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. తడి వ్యర్థాలను స్థానికంగానే కంపోస్టింగ్ చేయాలని, పొడి వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపించాలని, శానిటరీ, హానికర వ్యర్థాలను ప్రత్యేకంగా నగరపాలక సంస్థకు అప్పగించాలని పేర్కొన్నారు.

'స్వచ్ఛమైన కర్నూలు కోసం అందరూ భాగస్వాములు కావాలి'

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ, ప్రతి పౌరుడు ఇంటి వద్దే వ్యర్థాలను వేరు చేయడం, ప్రతి బల్క్ వేస్ట్ జనరేటర్ తమ వద్దే వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా మాత్రమే స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, కాలుష్యరహిత కర్నూలు నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. రీసైక్లింగ్ ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చని సూచించారు.

కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఎస్ఈ రమణమూర్తి, డీఈఈ పవన్‌కుమార్‌రెడ్డి, ఏఈ వైష్ణవి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసులకు రూ.1.90 లక్షల సమ్మర్ కిట్లు..

-హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

కర్నూలు, జూన్ 6: ఎండాకాలంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కర్నూలు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి రూ.1.90 లక్షల విలువైన సమ్మర్ కిట్ బ్యాగులను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం పంపిణీ చేశారు.

కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొని టోపీలు, స్టీల్ వాటర్ బాటిల్స్, ఎలక్ట్రాల్ బాక్స్‌లు, మాస్కులు, కళ్లద్దాలు తదితర వస్తువులతో కూడిన సమ్మర్ కిట్లను సిబ్బందికి అందజేశారు.

అంతకుముందు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉజీబీబిజీఏజీ ఃబీటటప్త్రజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పునర్నిర్మాణం చేసిన గదులను ప్రారంభించారు.




ఈ సందర్భంగా ఇటీవల విధి నిర్వహణలో ఉండగా మృతి చెందిన హోంగార్డు కృష్ణ కుటుంబానికి పోలీసు సిబ్బంది తరఫున సేకరించిన రూ.50,800 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

మీడియాతో మాట్లాడిన ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీజీపీ చీఫ్ ఆఫీస్ నుంచి అందిన నిధులతో రూ.1,90,500 విలువైన సమ్మర్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కర్నూలు నగరంతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు ట్రాఫిక్ విభాగాల్లో పనిచేస్తున్న మొత్తం 127 మంది ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ఈ కిట్లు అందజేసినట్లు చెప్పారు.

తీవ్ర ఎండలను లెక్కచేయకుండా ప్రజలకు సేవలందిస్తూ, ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల సేవలను ఎస్పీ అభినందించారు. వారి ఆరోగ్యం, సంక్షేమం కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె. బాబు ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, టూ టౌన్ సీఐ శ్రీధర్, సీసీఎస్ సీఐ రామకృష్ణ, ఆర్ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామసభలతో సమస్యల పరిష్కారం..

కామారెడ్డి, జూన్ 6:గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రామసభలు ఎంతో దోహదపడతాయని జుక్కల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సావిత్రి సాయగౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణను పురస్కరించుకుని శనివారం జుక్కల్ గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభ సర్పంచ్ సావిత్రి సాయగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామసభల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, గ్రామాభివృద్ధి, అర్హులకు సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు సమర్థవంతంగా జరుగుతాయని తెలిపారు. గ్రామస్తులు ప్రత్యేక గ్రామసభలతో పాటు గ్రామపంచాయతీ నిర్వహించే ప్రతి గ్రామసభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. గ్రామస్తుల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమ వుతుం దని, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గుల్లబేస్ గల్లీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దానిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. గ్రామసభలో పచ్చదనం, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయం, ఆరోగ్యం, తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధి హామీ పనులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే గ్రామాభివృద్ధికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ గ్రామసభలో ఉపసర్పంచ్ షేక్ ఫిర్దోస్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, సూపర్వైజింగ్ అధికారి, మిషన్ భగీరథ ఏఈ అఫ్నాన్, ఏపీఓ తులసీరాం, విద్యుత్ శాఖ అధికారులు బోడసాయిలు, విజయకుమార్, ఇతర గ్రామస్థాయి అధికారులు, ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం చేయాలి..



**-నేరస్తులకు తప్పనిసరిగా శిక్ష పడేలా చూడాలి..**
**-పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాలి..**
**-రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా**

రాజన్న సిరిసిల్ల, జూన్ 6: బాధితులకు న్యాయం చేయడంతోపాటు నేరస్తులకు శిక్ష పడడంలో కోర్టు డ్యూటీ పోలీస్ అధికారుల పాత్ర కీలకమని రామగుండం పోలీస్ కవి షనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వ వాంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలు, ఆస్తి సంబంధిత నేరాలు, శారీరక దాడులు తదితర కేసుల్లో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడే విధంగా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి, బలమైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి, న్యాయస్థానంలో సమర్థవంతంగా కేసులను వాదించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నేరస్తులకు శిక్ష పడడం ద్వారా బాధితుల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని, సమాజంలో నేరాల నియంత్రణకు కూడా ఇది దోహదపడుతుందన్నారు. ఎన్బీడబ్ల్యాలు, సమన్లను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. కేసులు విచారణలో ఉన్నప్పుడు కేవలం కోర్టుకు హాజరుకావడం మాత్రమే కాకుండా, నిందితులకు శిక్షలు పడేలా చూడటం కూడా పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. సరైన సమయంలో సమన్లు జారీ చేయడం, అవసరమైతే నిందితుల ఆస్తులను జప్తు చేయడం వంటి ప్రక్రియలను ఆలస్యం చె యకుండా వెంటనే చేపట్టాలన్నారు. రామగుండం కమిషనరేట్ పనితీరు కోర్టు డ్యూటీ, లైజనింగ్ అధికారుల పనితీరుపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా బాధితులు పోలీసులను ఎంతో నమ్మకంతో ఆశ్రయిస్తారని, నేరస్తులకు శిక్ష పడేలా చేసి వారికి భరోసా కల్పించడం పోలీసులు బాధ్యతగా పేర్కొన్నారు. సాక్షుల వాంగ్మూలాలు, సాంకె తిక ఆధారాలు, వైద్య ఆధారాలను సమగ్రంగా సేకరించి కోర్టుకు సమర్పిస్తేనే నేరస్తులకు శిక్ష విధించడం సాధ్యమవుతుందని తెలిపారు.

తద్వారా నేరస్తుల్లో నేరాలకు పాల్పడాలనే ఆలోచనకే భయం కలిగే పరిస్థితి రావాలన్నారు. రానున్న రోజుల్లో నేరాల నిరూపణ శాతాన్ని మరింత పెంచి, నిందితులకు శిక్షలు పడేలా చేయడం ద్వారా బాధితుల్లో పోలీస్ వ్యవస్థ పై మరింత విశ్వాసం పెంపొందించాలన్నారు. నేరం జరిగిన వెంటనే, ఆ సంఘటన ప్రభావం తగ్గకముందే శిక్ష విధించబడితే అది నేరస్తులపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేరొ ?కన్నారు. కాంటెస్టెడ్ కేసుల్లో నిందితులు బాధితులను బెదిరించడం లేదా ఇతర ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉంటుందని, అలాంటి సందర్భాల్లో కోర్టు డ్యూటీ అధికారులు బాధితులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు.

# ఘనంగా ఎంపీ బలరాం జన్మదిన వేడుకలు..

నల్గొండ, జూన్ 6: మాజీ కేంద్ర మంత్రి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి ఎంపీ పోరిక బలరాం నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు రావుల మురళి, పీసీసీ సభ్యుడు దశ్రు నాయక్, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, బండారు దయాకర్, నీలం దుర్గేష్ ముదిరాజ్, డీసీసీ అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, ఎండి అయూబ్ ఖాన్, పోలేపాక నాగరాజు, కౌన్సిలర్ తరాల వీరేష్ యాదవ్, కనుకుల రాంబాబు, మాజీ సర్పంచ్ సాంబయ్య, పోలపల్లి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలు నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు నరేటి కొమురయ్య, రాజులపాటి మల్లయ్య, సమ సుధాకర్, మూల భూలోక రెడ్డి, బానోత్ బాలు నాయక్, చేడుపెల్లి ఎలందర్, ఎండి తాజోద్దీన్, రషీద్ ఖాన్, నయీమ్, శ్రీహరి, గోలపల్లి మహేందర్, ముజ్జు షేక్, శ్రీరామ్ కిరణ్, బాలు, రాపోలు శ్రీనివాస్, బాదావత్ సుమన్, గుల్లేపెల్లి రాజేష్, ఎండి రఫీ, కాత్రేవుల హరికృష్ణ, ఎండి సమీర్, ఎండి రియాజ్, ఎండి నూరుద్దీన్, యకత్ చారి, శ్రీను, కళాధర్, ఉప్పునూతల శ్రీను, మదర్, తండా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగర్ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం..



నల్గొండ, జూన్ 6: తొర్రూరు పురపాలక సంఘం పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం యతిరాజరావు పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.

అంబేద్కర్ సంఘం నాయకుడు యామిని ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్, మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ, 6వ వార్డులోని అంబేద్కర్ నగర్‌లో ఉన్న ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవని, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని కోరారు.

అలాగే అంబేద్కర్ నగర్‌లోని పలు బజార్లలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణం, తాగునీటి సమస్యల పరిష్కారం, మధ్యలో నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం, ఇతర మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను వినతిపత్రంలో ప్రస్తావించినట్లు తెలిపారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మంగళపల్లి యాకయ్య, అంబేద్కర్ సంఘం మండల, పట్టణ అధ్యక్షుడు రాయిశెట్టి యాకేందర్, మంగళపల్లి సుధాకర్, మాజీ అధ్యక్షుడు మంగళపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో బిఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్..




పరకాల, జూన్ 6:: పరకాల నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బిఆర్ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక వైఖరిని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ పరకాల మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా భారతీయ జనతా పార్టీ లో చేరారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన నాయకులకు కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.

బిజెపిలోకి చేరిన వారిలో బిఆర్ఎస్ వార్డు మెంబర్ తాళ్ల మురళి, గ్రామ కార్యదర్శి తక్కలపల్లి కిరణ్, యూత్ అధ్యక్షులు బండి శివ, ప్రధాన కార్యదర్శి మారబోయిన సదానందం, ముదిరాజ్ కుల పెద్దమనిషి ఐరాబోయిన స్వామితో పాటు బొజ్జం వంశీ, ఎండి అంజాద్, గుర్రం నాగరాజు, తక్కలపల్లి మొగిలి వంటి ముఖ్యులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ మండల అధ్యక్షుడు కాసాగాని రాజకుమార్, గీసుకొండ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్, సంగెం మండల అధ్యక్షుడు దామరుప్పుల చంద్రమౌళి పాల్గొన్నారు. ఈ భారీ చేరికలతో పరకాల నియోజకవర్గంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా బలహీనపడ్డాయని, రాబోయే రోజుల్లో డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు నాయకత్వంలో పరకాలలో బిజెపి ప్రభంజనం సృష్టించడం ఖాయమని వారు భావిస్తున్నారు.

# రాష్ట్రపతి పాలన రాకూడదనే నిర్ణయం

తమిళనాడు, జూన్ 6: తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాల మధ్య డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ కూటమిలోని కొన్ని పార్టీలు టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నప్పుడు తానే అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు.

టీవీకేతో కలిసి పనిచేయాలనేది ఆయా పార్టీల నిర్ణయమని, అది వారి ప్రజాస్వామ్య హక్కు అని స్టాలిన్ పేర్కొన్నారు. కూటమి భాగస్వాములను తాను ఎప్పుడూ అడ్డుకోనని, వారు కోరుకున్న రాజకీయ నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కల్పించానని చెప్పారు.

తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించే పరిస్థితులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్టాలిన్ వివరించారు. కూటమి పార్టీలను అడ్డుకునే ప్రయత్నం చేసి ఉంటే రాజకీయ అనిశ్చితి పెరిగి, రాష్ట్రపతి పాలనకు మార్గం సుగమమయ్యేదని అభిప్రాయపడ్డారు. స్టాలిన్ చేసిన ఈ వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. టీవీకేకు మద్దతు అంశంపై ఆయన స్పష్టత ఇవ్వడంతో కూటమి రాజకీయాలపై కొత్త చర్చ మొదలైంది.

# ప్రభుత్వం-ప్రజల మధ్య వారధిగా మీడియా ఉండాలి

**-అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి.**
**-సమన్వయంతోనే అభివృద్ధి ఫలాలు ప్రజలకు**
**-అధికారులు-మీడియా మధ్య సమాచార లోపం ఉండొద్దు**
**-అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంలో మీడియా పాత్ర కీలకం**
**-మీడియాతో జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి ముఖాముఖి**

కర్నూలు, జూన్ 6: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరాలంటే మీడియా కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులకు సూచించారు.

శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ విస్తృతంగా చర్చించారు. జిల్లాలో చేపడుతున్న జలధార-జలహారతి



కార్యక్రమం, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు, రాబోయే ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు-ఎరువుల అందుబాటు, ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం, మీడియాతో అధికారుల సమన్వయం తదితర అంశాలపై ఆమె సమీక్ష నిర్వహించారు.

**జలధాం-జలహారతిపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ ఛానళ్ల శుభ్రపరిచే పనులు, వర్షపు నీటి సంరక్షణకు చేపడుతున్న చర్యలను కలెక్టర్ వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా సహకారం అవసరమని పేర్కొన్నారు.

**ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న వ్యవసాయ శాఖ**

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన సమాచారం రైతులకు సకాలంలో చేరేలా మీడియా సహకరించాలని కోరారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలపై అవగాహన**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, ఆంగ్ల మాధ్యమ బోధన, డిజిటల్ విద్య వంటి అంశాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులను తల్లిదండ్రులకు తెలియజేయడంలో మీడియా పాత్ర కీలకమన్నారు.

**మీడియా సమస్యలను విన్న కలెక్టర్**

సమావేశంలో మీడియా ప్రతినిధులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కొంతమంది అధికారులు మీడియా కోరిన సమాచారం సకాలంలో అందించడం లేదని, దీనివల్ల సమాచార లోపం ఏర్పడుతోందని వివరించారు.

అలాగే జిల్లా స్థాయిలో నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు ముందస్తు సమాచారం ఇవ్వడం, మీడియా ప్రతినిధుల రవాణా సౌకర్యాలపై దృష్టి పెట్టడం, వివిధ శాఖల నుంచి సమాచారాన్ని వేగంగా అందించే వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.

**కమ్యూనికేషన్ గ్యాప్‌కు తావు ఉండకూడదు**

ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ, అధికారులు మరియు మీడియా మధ్య సమాచార లోపం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించాలని అధికారులను ఆదేశించారు.

సమాచార శాఖ మరింత చురుకుగా వ్యవహరించి ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని మీడియాకు చేరవేయాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో మీడియా-పరిపాలన పరస్పర సహకారంతో పనిచేయాలని కోరారు.

అభివృద్ధి కార్యక్రమాలకు మీడియా సహకారం అవసరం

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరాలంటే మీడియా సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలోనూ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ మీడియా ద్వైపాక్షిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆమె సూచించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన లక్ష్యంగా పరిపాలన-మీడియా సమన్వయం మరింత బలోపేతం కావాలని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# మెగా జాబ్ మేళాతో యువతకు ఉపాధి దారి

**-చంద్రగిరిలో భారీగా తరలివచ్చిన నిరుద్యోగ యువత**
**-అర్హులైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని**
**-త్వరలో ఐటీ కంపెనీల రాకతో మరిన్ని ఉద్యోగ అవకాశాలు**
**-యువతకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే**

తిరుపతి, జూన్ 6:చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలం తనపల్లిలోని రఘునాథ్ రిసార్ట్స్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. హెచ్ ఫాక్స్‌కాన్ (నాట్స్) సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజక వర్గంలోని యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాటాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి దెబ్బతిందని, నిరుద్యోగ సమస్య పెరిగిందని విమర్శించారు. పరిశ్రమలను ప్రోత్సహించడంలో అప్పటి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలకు అనుగుణంగానే ప్రస్తుతం ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో నిర్వహించిన జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా వందలాది మంది యువతకు ఉద్యోగాలు లభించాయని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో ప్రతి ఏడాది మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈసారి అవకాశం పొందని అభ్యర్థులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, త్వరలో నియోజకవర్గంలో ఐటీ కంపెనీలు రానున్నాయని, వాటి ద్వారా మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

ఉద్యోగం సాధించిన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాల్లో భాగస్వాములు కావాలని, ఉద్యోగం చిన్నదైనా పెద్దదైనా అంకితభావంతో పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. అలాగే పెరుగుతున్న జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని సంస్థలు తగిన వేతనాలతో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమం అనంతరం మెగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పార్టీ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఆహ్వానం

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య

మరియు

ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం

శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో

శ్రీ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.

తేది : 19-06-2026, శుక్రవారం, సమయం : సా॥ 6.00 గంటలకు

" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "

| | | |
|---|---|---|
| ముఖ్య అతిథి | : | లయన్ డా॥ వై. ఎమ్. ధర్, లయన్స్ క్లబ్, మాజీ గవర్నర్ |
| సభాధ్యక్షులు | : | శ్రీ పి. పవన్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త |
| విశిష్ట అతిథి | : | శ్రీ కళా జనార్ధన మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ |
| గౌరవ అతిథి | : | శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం |
| పురస్కార గ్రహీత | : | శ్రీమతి డా॥ పి. భవాని, కన్సల్టింగ్ హోమియో ఫిజిషియన్ |
| ప్రత్యేక ఆహ్వానితులు | : | శ్రీమతి కె. కామేశ్వరి, ట్యాక్స్ కన్సల్టెంట్ |
| ఆత్మీయ అతిథి | : | శ్రీమతి పొత్తూరి జయలక్ష్మి, మేనేజర్ సాహితీ కిరణం |
| పురస్కార ప్రదాత | : | శ్రీ ఏకా నాగరాజు రామమోహన్ రావు, ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్ |
| వందన సమర్పణ | : | శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని |

లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య

ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650.


# ఎమ్మెల్యే ఆరణి జనవాణికి 54 వినతులు




తిరుపతి, జూన్ 6:జనసేన పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిర్వహించిన జనవాణి కి 54 వినతులు అందాయి. శనివారం ఉదయం తన కార్యాలయంలో జనవాణి నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు రెండు, సహాయ కమిషనర్ కు 12, ఎస్ ఈ కి 12, ప్రణాళిక విభాగానికి 4, ఆరోగ్య అధికారికి 3, హౌసింగ్ కు 7, టీటీడీకి సంబంధించి 7, తహసిల్దార్ కు సంబంధించి 3, కలెక్టర్ కు ఒకటి, వెటర్నరీ జేడీ కి ఒకటి, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ కు ఒకటి, రుయా ఆస్పత్రి సూపరిండెంట్ కు ఒకటి, నారాయణ స్కూల్ ఏజిఎం కు ఒక వినతి పత్రం వచ్చాయి.

ఈ వివతి పత్రాలను శాఖల వారీగా విభజించి సంబంధిత అధికారులకు పంపినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సమస్యలను నేరుగా తెలుసుకుని అధికారులకు వాటిని చేర్చి పరిస్కరించడమే లక్ష్యంగా జనవాణి నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆర్ ఓ రవి, డిఈ మహేష్, ఎస్పీ డీసీఎల్ ఏఈ ఉమాపతి, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా కేడీసీసీ.

-కే డి సి సి చైర్మన్ నెట్టెం రఘురాం..
-రైతులు, మహిళా సంఘాలకు రూ.3 కోట్ల ఆర్థిక చేయూత
-జగ్గయ్యపేటలో చెక్కుల పంపిణీ..
-మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ఎమ్మెల్యే తాతయ్య
-కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా రఘురాం ఏడాది పూర్తి సందర్భంగా కేక్ కటింగ్




అమరావతి, జూన్ 6: రైతులు, డ్వాక్రా మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందని కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కేడీసీసీ) చైర్మన్, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురాం పేర్కొన్నారు. గౌరవరం, మంగోలు, కృష్ణ ఫార్మసీ సొసైటీల ఆధ్వర్యంలో రైతులు, డ్వాక్రా మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం శనివారం జగ్గయ్యపేటలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కృష్ణా సొసైటీ పరిధిలో సుమారు రూ.3 కోట్ల విలువైన చెక్కులను కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ రైతులు, డ్వాక్రా మహిళా సంఘాల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని చెప్పారు. రైతుల అవసరాలకు అనుగుణంగా కేడీసీసీ బ్యాంక్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. రూ.3 కోట్ల ఆర్థిక సహాయం ద్వారా అనేక కుటుంబాలకు భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ రైతు సంక్షేమం, మహిళా సాధికారత ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రతి కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

సహకార రంగాన్ని బలోపేతం చేస్తూ రైతులకు, మహిళలకు సేవలందిస్తున్న రఘురాం కృషిని అభినందించారు. అనంతరం కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్‌గా నెట్టెం శ్రీ రఘురాం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవరం పీఏసీఎస్ అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, పోచంపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు ముల్లంగి రామకృష్ణారెడ్డి, కృష్ణ ఫార్మసీ సొసైటీ అధ్యక్షుడు యానాల గోపీచంద్, మంగోలు పీఏసీఎస్ అధ్యక్షుడు బొల్లం పురుషోత్తం, గోపాలకృష్ణ సొసైటీ అధ్యక్షుడు ధూళిపాళ్ల లక్ష్మణరావు, జగ్గయ్యపేట మండల డ్వాక్రా సమాఖ్య అధ్యక్షురాలు నాయిని రజిని, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఇస్లావత్ శీను నాయక్, మహిళా సంఘాల సభ్యులు, లబ్ధిదారులు, కేడీసీసీ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రాలలో సౌకర్యాలు కల్పించాలి

-ఫ్యాప్టో జిల్లా చైర్మన్ విజయరామరాజు

అమరావతి, జూన్ 6: ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ విజయ రామరాజు కోరారు. పశ్చిమగోదావరి జిల్లాలో 1, 2 తరగతులు భోదించుచున్న ఉపాధ్యాయులకు జరుగుచున్న ఎఫ్ ఎల్ ఎన్ శిక్షణా కేంద్రాలలో వేసవి తీవ్రత ఎక్కువగా వున్న కారణంగా చల్లని త్రాగునీరు, రుచికరమైన భోజనం, ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా, వాష్ రూంల్లో నిరంతర నీటి సదుపాయం కల్పించాలన్నారు.

ఈ మేరకు జిల్లా విద్యా శాఖ ఆడిషినల్ డైరెక్టర్ సత్యనారాయణకి శనివారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ విజయరామరాజు, సెక్రెటరీ జనరల్ జి.ప్రకాశం, జిల్లా కో ఛైర్మన్లు సాయి వర్మ, క్రాంతి కుమార్, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రామచంద్ర రావు,ంమణ తదితరులు పాల్గొన్నారు.

# జూలూరుపాడు తాసీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం ధర్నా

- స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్




ఖమ్మం, జూన్ 6:సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా అనుబంధ అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జూలూరుపాడు మండల తాసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రైతు సమస్యల పరిష్కారం, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలు, కనీస మద్దతు ధరల పెంపు తదితర డిమాండ్లతో ఈ ఆందోళన చేపట్టారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకుడు జాటోత్ కృష్ణ, అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బానోతు ధర్మ పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలోని ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. 2014లో అధికారంలోకి రాకముందు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు సమగ్ర వ్యవసాయ ఉత్పత్తి ఖర్చు ఆధారంగా కనీస మద్దతు ధరలను నిర్ణయిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు.

2026-27 ఖరీఫ్ సీజన్‌కు 14 పంటల ఎంఎస్‌పీలను పెంచినట్లు ప్రకటించినప్పటికీ, వాస్తవ ఉత్పత్తి ఖర్చులను పరిగణనలోకి తీసుకోకుండా నూతన విధానాన్ని అనుసరించడం వల్ల రైతులకు న్యాయం జరగడం లేదన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల వేతనాలు, డీజిల్, విద్యుత్, సాగునీటి ఖర్చులు ఏడాదికేడాది పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు రైతుల పెట్టుబడులకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పంటలను మార్కెట్లకు తీసుకెళ్లిన రైతులు ఎంఎస్‌పీ కంటే తక్కువ ధరలకు మధ్యవర్తులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి, కంది తదితర పంటలకు సంబంధించి కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు.

రైతులు ఆందోళనలకు దిగిన తర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రాలు తెరవడం దురదృష్టకరమన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య రైతు సంఘం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు లింగాల వీరభద్రం, జాటోత్ నారసింహా, పైడా వెంకటేశ్వర్లు, తాటి నరసింహారావు, తెల్లం కృష్ణయ్య, మలకం సతీష్, బానోతు లాలు, భూక్య శకురు, బాదావత్ బోజ్యా, కోటయ్య, వి. పద్మావతి, నాగ విజయలక్ష్మి, రామనాథం, వెంకటమ్మ పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి : జడ్పీ సీఈఓ నాగలక్ష్మి



ఖమ్మం, జూన్ 6:ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం కింద జూలూరుపాడు మండలంలోని గ్రామ పంచాయతీల్లో శనివారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభలకు జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరై ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ప్రజలకు వివరించారు. కాకర్ల గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో పంచాయతీరాజ్ ఢ గ్రామీణ ఉపాధి శాఖ డిప్యూటీ కమిషనర్ విద్యాలత, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డిప్యూటీ సీఈఓ అప్పారావు, డివిజనల్ పంచాయతీ అధికారి ప్రభాకర్, ఎంపీడీఓ తాళ్లూరి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను ప్రజల ముందుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామస్థుల బాధ్యతలు, ప్రజా భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు.

అదేవిధంగా ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ సీఈఓ నాగలక్ష్మి వీడియో ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించగా, అనంతరం ప్లాస్టిక్ రహిత గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ కమిషనర్ విద్యాలత మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థలో శాఖల సమన్వయం కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా అందించేందుకు మండల స్థాయి అధికారులు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు.

గ్రామ సభల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి గ్రంథాలయ చైర్మన్‌గా గంగరాజు యాదవ్ నియామకం

నల్గొండ, జూన్ 6:తుంగతుర్తి మండల కేంద్రంలోని గ్రంథాలయ చైర్మన్ గా వీరబోయిన గంగరాజు యాదవ్ నియామకమయ్యారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేలు చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గంగరాజు యాదవ్ మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే మందుల సామేలు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వంగవీటి రామారావు, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రేగటి రవి, దాసరి శ్రీను, కలకోట్ల మల్లేష్, మాచర్ల అనిల్, కొండ రాజు పాల్గొన్నారు.

# పిల్లల్లో నైపుణ్యాల పెంపే లక్ష్యం

-టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్త్
- చెర్లగౌరారం గ్రామంలో ఘనంగా 'బాల పంచాయతీ' కార్యక్రమం

నల్గొండ, జూన్ 6:పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, విమర్శనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా 'బాల పంచాయతీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్త్ తెలిపారు. శనివారం నల్లగొండ జిల్లా కనగల్ మండలం చెర్లగౌరారం గ్రామంలో జిల్లా పోలీస్ శాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆదేశానుసారం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాల పంచాయతీ' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్త్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామస్థాయి నుండి పిల్లలకు ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించడం, వారి అభిప్రాయాలను వినడం, గ్రామాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామంలో ఉన్న పలు సమస్యలపై తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తపరిచారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, బాలల భద్రత, విద్యా ప్రమాణాలు, గ్రామాభివృద్ధి వంటి అంశాలపై బాలలు చర్చించారు. బాలలతో నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్లు, అవగాహన కార్యక్రమాలు, ప్రశ్నోత్తర సమావేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా అభిలాషా బిష్త్ మాట్లాడుతూ పిల్లల హక్కులు, వారి భవిష్యత్ నిర్మాణం సమాజానికి అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లల రక్షణ కుటుంబం నుంచే ప్రారంభమవుతుందని, ప్రతి తల్లి తండ్రి పిల్లలకు సమయం కేటాయిస్తూ వారి ఆలోచనలను ప్రోత్సహించాలని సూచించారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన దిశలో మార్గనిర్దేశం చేస్తే భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడే నాయకులుగా ఎదుగుతారని తెలిపారు. సమాజంలో మార్పు రావాలంటే ముందుగా ప్రతి ఒక్కరూ తమలో మార్పు తీసుకురావాలని సూచించారు. అలాగే చిన్నారులు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తపరచాలని, సమాజంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "పిల్లలే మన భవిష్యత్, వారికి సమయం ఇవ్వండి, వారి ఆలోచనలను వినండి, ప్రోత్సహించండి'' అని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచే పిల్లలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురాగలమన్నారు. విద్యతో పాటు పిల్లల్లో సామాజిక అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు. బాలలు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ బాలల భద్రత, విద్య, మానసిక అభివృద్ధి కోసం జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో బాలల సమస్యలు,రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యంగిస్థాన్ ఎన్జీఓ, ఆశ్రిత ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొని బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యత, సురక్షిత బాల్యం, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చివరగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో బాలల సాధికారత, సంక్షేమం కోసం అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, ఎంపీడీఓ వేద రక్షిత, సీఐలు ఆదిరెడ్డి, రాము, కరుణాకర్, ఎస్.ఐ అంజలి, రాజీవ్ రెడ్డి, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, డీఈఓ సుశీందర్ రావు, సీడబ్ల్యూసీ చైర్మన్ కృష్ణయ్య, చెర్లగౌరారం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, యువత, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామ సభల ద్వారా సమస్యలు పరిష్కారం : జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి

నల్గొండ, జూన్ 6:గ్రామ సభలు ప్రజల సమస్యలు పరిష్కరించడానికి వేదికగా నిలుస్తాయని నల్లగొండ జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కట్టంగూర్ మండలం అయిటిపాములలో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాభివృద్ధి అనేది ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, పచ్చదనం, మౌలిక వసతులు కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ సభలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

సర్పంచ్ బెల్లి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.రమేశ్, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా కానిస్టేబుల్ శ్రీలత ను సత్కరించిన రామగుండం పోలీస్ కమిషనర్

కరీంనగర్, జూన్ 6:మూడో ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో యోగా విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ శ్రీలతను శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఘనంగా సత్కరించారు.

ఇటీవల హర్యానా రాష్ట్రంలోని కర్నాల్‌లో నిర్వహించిన మూడో ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో 35 నుంచి 45 సంవత్సరాల వయో విభాగంలో జరిగిన యోగా పోటీల్లో శ్రీలత ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆమెకు అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి శాఖకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వానాకాలం పంటలపై రైతులకు ముందస్తు అవగాహన

- కేవీకే కొత్తగూడెం ఆధ్వర్యంలో 150 మంది మహిళా రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ



ఖమ్మం, జూన్ 6:కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో శనివారం వానాకాలం పంటల సాగుపై ముందస్తు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధి, అశ్వాపురం మండలం పరిధి నుండి సుమారు 150 మంది రైతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ టి.భరత్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకుని, వాటి ఫలితాల ఆధారంగా అవసరమైన మేరకే ఎరువులను వినియోగించాలని సూచించారు. పోటీతత్వంతో అధిక మోతాదులో ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

ఉద్యాన శాస్త్రవేత్త శివ మాట్లాడుతూ.. రైతుల కోసం కేవీకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, ఆధునిక సాగు సాంకేతిక పద్ధతుల పరిచయం, శిక్షణా కార్యక్రమాలు, వాతావరణ సమాచారం, పంటల యాజమాన్యం, చీడపీడల నివారణ తదితర అంశాలపై నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి ఆయిల్ పామ్, మునగ, పందిరి పద్ధతిలో తీగజాతి కూరగాయల సాగు చేపట్టడం ద్వారా స్థిరమైన ఆదాయం పొందవచ్చని సూచించారు. అనంతరం కేవీకే ప్రాంగణంలో నిర్వహిస్తున్న "ఖేతి బచావో అభియాన్'' కార్యక్రమంలో భాగంగా మట్టి నమూనాల సేకరణ విధానాన్ని రైతులకు ప్రదర్శించారు. అలాగే గిరిజన ఉప ప్రణాళిక పథకం కింద 150 మంది మహిళా రైతులకు వరి నాణ్యమైన వంగడం రకం కేఎన్ఎం?1638 విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, వ్యవసాయ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టిన లారీ.. 9 మంది మృతి, పలువురికి గాయాలు




చండీగఢ్, జూన్ 6: మరణించిన వృద్ధురాలి అంత్యక్రియలకు హాజరైన 28 మంది ట్రాక్టర్ ట్రాలీలో తిరుగు ప్రయాణమయ్యారు. ఒక లారీ దానిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. మరి కొందరు గాయపడ్డారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జలాలాబాద్‌కు చెందిన ఒక వృద్ధురాలు మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులతో సహా సుమారు 28 మంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత ట్రాక్టర్ ట్రాలీలో తిరుగు ప్రయాణమయ్యారు.

కాగా, బుధవారం తెల్లవారుజామున ఫిరోజ్ పూర్-ఫాజిల్కా రహదారిపై ఆ ట్రాక్టర్ ట్రాలీని ఒక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు పురుషులు, ఒక మహిళ సహా నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. చికిత్స పొందుతూ మరో ఐదుగురు చనిపోయారు.

మరోవైపు గాయపడిన మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడిన కొందరిని మెరుగైన చికిత్స కోసం ఫరీద్‌కోట్‌లోని ప్రత్యేక వైద్య కేంద్రానికి తరలించారు.

ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎబోలా వైరస్: మానవాళి ఉనికికి సవాలుగా మారిన అదృశ్య శత్రువు

ఎబోలా వైరస్ మానవాళి ఆరోగ్య చరిత్రలో అత్యంత క్రూరమైన, ప్రాణాంతకమైన అంటువ్యాధులలో ఒకటిగా నిలిచింది. ప్రపంచ ఆరోగ్య రంగాన్ని గత ఐదు దశాబ్దాలుగా తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్న ఈ వ్యాధి, ఆధునిక వైద్య శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి ఒక నిరంతర సవాలుగా మారింది. ఇరవై ఒకటో శతాబ్దంలో కోవిడ్-19 మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేయడానికి చాలా కాలం ముందే, ఆఫ్రికా ఖండంలోని అనేక దేశాల సామాజిక, ఆర్థిక మూలాలను ఎబోలా వైరస్ ఛిన్నాభిన్నం చేసింది. ఎంతటి అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, ప్రకృతిలో దాగి ఉన్న అదృశ్య వైరస్‌లు, వాటి రూపాంతరాలు మానవ ఉనికికే ముప్పుగా పరిణమించగలవని ఎబోలా సంక్షోభం నిరూపించింది. అందువల్ల ఈ వ్యాధి పూర్వాపరాలు, దాని వ్యాప్తి తీరు, వైద్యపరమైన సవాలు మరియు ప్రపంచవ్యాప్తంగా అది సృష్టించిన సామాజిక-ఆర్థిక పరిణామాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ భయంకరమైన వైరస్ యొక్క మూలాలను పరిశీలిస్తే, ఇది 1976వ సంవత్సరంలో మధ్య ఆఫ్రికా ప్రాంతంలో మొదటిసారిగా వెలుగుచూసింది. అప్పటి జైర్ దేశంలో (ప్రస్తుత కాంగో ప్రజాస్వామ్య రిపబ్లిక్) ప్రవహించే 'ఎబోలా' అనే నది పరిసర గ్రామాలలో ఈ వ్యాధి తీవ్రంగా ప్రబలడంతో, శాస్త్రవేత్తలు ఆ నది పేరిట దీనిని "ఎబోలా వైరస్ డిసీజ్" (EVD) అని పిలిచారు. అదే సమయంలో సుమారు ఐదు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న సూడాన్ ప్రాంతంలోనూ (ప్రస్తుత దక్షిణ సూడాన్) ఇటువంటి లక్షణాలతో కూడిన వ్యాధి నమోదైంది. ప్రారంభంలో ఇది కేవలం ఆఫ్రికాలోని మారుమూల అటవీ ప్రాంతాలకే పరిమితమైన స్థానిక సమస్యగా భావించబడినప్పటికీ, రానురాను అంతర్జాతీయ సరిహద్దులను దాటి ప్రపంచ ఆరోగ్యానికి అతిపెద్ద ముప్పుగా పరిణమించాయి.


శాస్త్రీయ వర్గీకరణ ప్రకారం ఎబోలా వైరస్ 'ఫిలోవిరిడే' (Filoviridae) అనే వైరస్ కుటుంబానికి చెందినది. ఇందులో ప్రధానంగా ఐదు విభిన్న రకాల జాతులను గుర్తించారు, వాటిలో జైర్, సూడాన్, బుండిబుగ్యో, తాయ్ ఫారెస్ట్ మరియు రెస్టన్ రకాలు ఉన్నాయి. వీటిలో జైర్ ఎబోలా వైరస్ అత్యంత ప్రాణాంతకమైనదిగా రుజువైంది. ఇది ప్రాథమికంగా జంతువుల నుండి మనుషులకు సంక్రమించే ఒక జూనోటిక్ (Zoonotic) వ్యాధి. వన్యప్రాణుల పరిశోధనల ప్రకారం 'టెరోపొడిడే' కుటుంబానికి చెందిన పండ్ల గబ్బిలాలు (Fruit Bats) ఈ వైరస్‌కు సహజ నిలయాలుగా వ్యవహరిస్తాయి. ఈ గబ్బిలాల ద్వారా అడవిలోని చింపాంజీలు, గొరిల్లాలు, కోతులు, అడవి పందులు మరియు ముళ్లపందులు వంటి జంతువులకు వైరస్ సోకుతుంది. వేటగాళ్లు లేదా స్థానిక ప్రజలు ఈ సోకిన జంతువుల మాంసాన్ని సేకరించేటప్పుడు, వండేటప్పుడు లేదా వాటి లాలాజలం, రక్తాన్ని తాకినప్పుడు ఈ వైరస్ మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది.

ఒకసారి మానవ సమాజంలోకి ప్రవేశించిన తర్వాత, ఈ వైరస్ ఒకరి నుండి మరొకరికి అత్యంత వేగంగా సంక్రమిస్తుంది. గాలి ద్వారా లేదా దోమల ద్వారా ఇది వ్యాపించనప్పటికీ, సోకిన రోగి యొక్క రక్తం, లాలాజలం, చెమట, మూత్రం, వాంతులు, మలమూత్రాలు మరియు వీర్యం వంటి శరీర ద్రవాల (Body Fluids) ద్వారా ఇది ప్రత్యక్షంగా వ్యాప్తి చెందుతుంది. రోగులకు పరిచర్యలు చేసే కుటుంబ సభ్యులు, సరైన రక్షణ కవచాలు లేకుండా చికిత్స అందించే వైద్య సిబ్బంది ఈ వ్యాధి బారిన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. దురదృష్టవశాత్తూ, ఎబోలా బారిన పడి మరణించిన వ్యక్తి శరీరంలో కూడా ఈ వైరస్ చాలా రోజుల పాటు సజీవంగా ఉండి అత్యంత చురుగ్గా వ్యవహరిస్తుంది, దీనివల్ల మృతదేహాలను తాకడం కూడా సమాజంలో వైరస్ విస్తరణకు దారితీస్తుంది.

ఎబోలా వైరస్ మానవ శరీరంలో ప్రవేశించిన తర్వాత లక్షణాలు బయటపడటానికి 2 నుండి 21 రోజుల సమయం పడుతుంది, దీనినే పొదిగే కాలం (Incubation Period) అంటారు. ప్రారంభ దశలో ఈ వ్యాధి లక్షణాలు సాధారణ జ్వరం, మలేరియా లేదా టైఫాయిడ్ వంటి లక్షణాలను పోలి ఉంటాయి. రోగికి అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, విపరీతమైన తలనొప్పి, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, విపరీతమైన నీరసం మరియు గొంతు నొప్పి వంటివి కనిపిస్తాయి. వ్యాధి తదుపరి దశకు చేరుకునే కొద్దీ వాంతులు, తీవ్రమైన విరేచనాలు, కడుపు నొప్పి మరియు కాలేయం, మూత్రపిండాల వంటి కీలక అవయవాల పనితీరు మందగించడం సంభవిస్తుంది. అత్యంత ప్రమాదకరమైన చివరి దశలో, వైరస్ శరీరంలోని రక్తనాళాలను బలహీనపరిచి, రక్తం గడ్డకట్టే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. దీనివల్ల రోగి ముక్కు, నోరు, కళ్లు మరియు విసర్జన అవయవాల గుండా అంతర్గతంగా, బాహ్యంగా రక్తస్రావం (Hemorrhage) జరుగుతుంది. ఈ కారణంగానే దీనిని వైద్య పరిభాషలో "ఎబోలా వైరల్ హీమరాజిక్ ఫీవర్" అని పిలుస్తారు. రోగనిరోధక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలడం, బహుళ అవయవాల వైఫల్యం మరియు తీవ్రమైన నిర్జలీకరణం (Dehydration) కారణంగా బాధితులు మరణిస్తారు.

ఈ వ్యాధి యొక్క అత్యంత భయానకమైన అంశం దాని మరణాల రేటు (Case Fatality Rate). ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) అందించిన చారిత్రక ఆధారాల ప్రకారం, ఎబోలా సోకిన వారిలో మరణాల రేటు 25 శాతం నుండి 90 శాతం వరకు నమోదైంది. సగటున చూసుకుంటే ఈ వ్యాధి సోకిన ప్రతి వంద మందిలో యాభై మంది మరణిస్తున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచంలో మరే ఇతర అంటువ్యాధికీ ఇంతటి అధిక మరణాల రేటు లేకపోవడం ఎబోలా ఎంతటి ఘోరమైనదో తెలియజేస్తుంది. ముఖ్యంగా పేదరికం, వైద్య సదుపాయాల కొరత, రవాణా సౌకర్యాలు లేని వెనుకబడిన దేశాలలో ఈ మరణాల తీవ్రత వంద శాతానికి చేరువైన సందర్భాలు కూడా ఉన్నాయి.

వైద్య చరిత్రలో 2014 నుండి 2016 మధ్య కాలంలో పశ్చిమ ఆఫ్రికాలో సంభవించిన ఎబోలా విపత్తు అత్యంత భారీ మరియు సంక్లిష్టమైనదిగా నమోదైంది. గినియా దేశంలో ప్రారంభమైన ఈ మహమ్మారి మెరుపు వేగంతో పొరుగు దేశాలైన లైబీరియా, సియెర్రా లియోన్ వంటి ప్రాంతాలకు విస్తరించింది. ఈ ఘోర విపత్తులో సుమారు 28,616



మందికి పైగా ఈ వైరస్ బారిన పడగా, అధికారికంగా 11,310 మంది మరణించారు. అప్పటికే అంతర్యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న ఆయా దేశాల ప్రజారోగ్య వ్యవస్థలు ఈ మహమ్మారి ధాటికి పూర్తిగా విచ్ఛిన్నమయ్యాయి. రోగులతో ఆసుపత్రులు నిండిపోవడం, తగినంత మంది వైద్యులు లేకపోవడం, శ్మశాన వాటికలు శవాలతో నిండిపోవడంతో అంతర్జాతీయ సమాజం ఒక్కసారిగా గ్భ్రాంతికి గురైంది. పరిస్థితి చేయిదాటిపోవడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని "అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి" (PHEIC) గా ప్రకటించి, ప్రపంచ దేశాల సహాయాన్ని కోరింది.

ఎబోలా వైరస్ ఇంత వేగంగా మహమ్మారిగా మారడానికి కేవలం జీవసంబంధిత కారణాలే కాకుండా అనేక సామాజిక, సాంస్కృతిక మరియు ఆర్థిక అంశాలు కూడా దోహదపడ్డాయి. ఆఫ్రికాలోని సాంప్రదాయ సమాజాలలో మరణించిన వ్యక్తుల అంత్యక్రియల సమయంలో మృతదేహాన్ని కడగడం, కౌగిలించుకోవడం, ముద్దు పెట్టుకోవడం వంటి ఆచారాలు ఉన్నాయి. ఎబోలా సోకి చనిపోయిన వ్యక్తి శరీరం నుండి స్రవించే ద్రవాలలో వైరస్ లోడ్ చాలా ఎక్కువగా ఉండటం వల్ల, ఈ ఆచారాల ద్వారా వందలాది మందికి ఒకేసారి వ్యాధి సోకింది. దీనికి తోడు, అడవులను విచ్చలవిడిగా నరకడం వల్ల గబ్బిలాల ఆవాసాలు దెబ్బతిని అవి మానవ నివాస ప్రాంతాలకు దగ్గరవ్వడం, ఆహార కొరత కారణంగా అడవి జంతువుల మాంసాన్ని (Bushmeat) ఆశ్రయించడం వ్యాప్తిని పెంచింది. ప్రజలలో సరైన అవగాహన లేకపోవడం, ప్రభుత్వాలపై నమ్మకం లేకపోవడం వల్ల చాలా మంది రోగులను ఆసుపత్రులకు తీసుకురాకుండా ఇళ్లలోనే దాచడం పరిస్థితిని మరింత జటిలం చేసింది.

వైద్య శాస్త్ర పరంగా ఎబోలాను ప్రాథమిక దశలో గుర్తించడం ఒక పెద్ద సవాలు. ఎందుకంటే దీని ప్రారంభ లక్షణాలు ఆఫ్రికాలో సర్వసాధారణమైన మలేరియా, కలరా లేదా లాస్సా జ్వరం వంటి వ్యాధులను పోలి ఉంటాయి. అందువల్ల కేవలం శారీరక లక్షణాల ఆధారంగా కాకుండా ఖచ్చితమైన ప్రయోగశాల పరీక్షల ద్వారానే దీనిని నిర్ధారించాల్సి ఉంటుంది. రక్త నమూనాలను సేకరించి 'రివర్స్ ట్రాన్స్‌క్రిప్టేజ్ పాలిమరేస్ చైన్ రియాక్షన్' (RT-PCR) పరీక్షల ద్వారా వైరస్ యొక్క జన్యుపదార్థాన్ని గుర్తిస్తారు. అలాగే 'ఎలిసా' (ELISA) పరీక్షల ద్వారా యాంటీబాడీలను కూడా గుర్తిస్తారు. అయితే ఈ పరీక్షలు నిర్వహించడానికి అత్యంత సురక్షితమైన 'బయోసేఫ్టీ లెవెల్-4' (BSL-4) ప్రయోగశాలలు అవసరమవుతాయి, ఇవి వెనుకబడిన దేశాలలో అందుబాటులో లేకపోవడం వల్ల వ్యాధి నిర్ధారణ ఆలస్యమై, ఈలోపే ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది.

ఎబోలాకు దశాబ్దాల కాలం పాటు ఎటువంటి నిర్దిష్టమైన మందు లేదా వ్యాక్సిన్ అందుబాటులో లేదు. కేవలం రోగి శరీరంలో కోల్పోయిన ద్రవాలను ఓరల్ రీహైడ్రేషన్ లేదా ఐవీ ఫ్లూయిడ్స్ ద్వారా భర్తీ చేయడం, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటం, రక్తపోటును నియంత్రించడం మరియు ఇతర ద్వితీయ సంక్రమణలను నివారించడం వంటి సహాయక చికిత్స (Supportive Care) మాత్రమే అందించేవారు. అయితే, 2014 నాటి భారీ విపత్తు తర్వాత ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు వేగవంతమయ్యాయి. దీని ఫలితంగా 'ఇన్మాజెబ్' (Inmazeb), 'ఎబుంగా' (Ebanga) వంటి మోనోక్లోనల్ యాంటీబాడీ ఔషధాలను శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ఈ లాబొరేటరీ తయారీ ప్రొటీన్లు వైరస్‌ను నేరుగా అటాక్ చేసి, అది కణాలలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటాయి. వ్యాధి సోకిన వెంటనే ఈ చికిత్సను అందిస్తే మరణాల రేటును గణనీయంగా తగ్గించవచ్చని క్లినికల్ ట్రయల్స్ నిరూపించాయి.

చికిత్స కంటే నివారణ మిన్న అనే సూత్రం ప్రకారం, ఎబోలా నియంత్రణలో అత్యంత విప్లవాత్మకమైన పరిణామం వ్యాక్సిన్ ఆవిష్కరణ. 2019వ సంవత్సరంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు అంతర్జాతీయ నియంత్రణ సంస్థలు "ఎర్వెబో" (Ervebo) అనే నివారణ టీకాకు అధికారిక అనుమతులు మంజూరు చేశాయి. జైర్ ఎబోలా వైరస్ రకానికి వ్యతిరేకంగా ఈ టీకా నూటికి నూరు శాతం సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు తేలింది. ఈ వ్యాక్సిన్‌ను ప్రపంచవ్యాప్తంగా "రింగ్ వ్యాక్సినేషన్" (Ring Vaccination) వ్యూహం ద్వారా అమలు చేస్తున్నారు. అంటే ఎక్కడైనా ఒక ఎబోలా కేసు నమోదైనప్పుడు, ఆ రోగితో ప్రత్యక్షంగా సంబంధాలు ఉన్న వ్యక్తులను, అలాగే వారితో పరిచయం ఉన్న ద్వితీయ శ్రేణి వ్యక్తులను (ఒక వలయంలా) గుర్తించి వారికి మాత్రమే తక్షణమే టీకా ఇస్తారు. ఈ పద్ధతి ద్వారా వైరస్ ఒకరి నుండి ఒకరికి సాగే గొలుసుకట్టు వ్యాప్తిని (Chain of Transmission) అక్కడికక్కడే తెంచివేయడానికి వీలవుతుంది.


ఎబోలా సృష్టించిన నష్టం కేవలం ఆరోగ్య రంగానికే పరిమితం కాలేదు; అది ఆయా దేశాల సమగ్ర సామాజిక, ఆర్థిక వ్యవస్థలను కుప్పకూల్చింది. మహమ్మారి విజృంభించిన కాలంలో సరిహద్దులు మూతపడటం, విమాన సర్వీసులు రద్దు కావడం వల్ల అంతర్జాతీయ వ్యాపారాలు నిలిచిపోయాయి. స్థానికంగా మార్కెట్లు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. వ్యవసాయ రంగంలో కూలీలు దొరక్క ఆహార ఉత్పత్తి క్షీణించి ఆకలి కేకలు పెరిగాయి. పర్యాటక రంగం పూర్తిగా దెబ్బతింది. ప్రపంచ బ్యాంక్ అంచనాల ప్రకారం, పశ్చిమ ఆఫ్రికా దేశాలు కేవలం రెండు సంవత్సరాల కాలంలోనే బిలియన్ల కొద్దీ డాలర్ల జాతీయ ఆదాయాన్ని కోల్పోయి దశాబ్దాల కాలం వెనక్కి వెళ్ళిపోయాయి. మానవీయ కోణంలో చూస్తే, వేలాది మంది పిల్లలు అనాథలయ్యారు, వ్యాధి నుండి కోలుకున్న బాధితులను (Survivors) సమాజం వెలివేయడం, వారిని అనుమానంగా చూడటం వంటి సామాజిక వివక్ష తీవ్రమైన మానసిక వేదనకు గురిచేసింది.

కోవిడ్-19 అనంతర కాలంలో ప్రపంచ ప్రజారోగ్య నిపుణులు అంటువ్యాధుల పట్ల తమ వ్యూహాలను పూర్తిగా మార్చుకున్నారు. ఎబోలా వంటి ప్రాణాంతక వైరస్‌ల పుట్టుక మనకు ఒక ముఖ్యమైన సత్యాన్ని బోధిస్తోంది; మానవ ఆరోగ్యం అనేది ప్రకృతి నుండి, జంతుజాలం నుండి విడిగా లేదు. ఈ నేపథ్యంలోనే "వన్ హెల్త్" (One Health) అనే సమగ్ర ఆరోగ్య దృక్పథం అంతర్జాతీయంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ విధానం ప్రకారం మానవుల ఆరోగ్యం, జంతువుల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ అనేవి పరస్పరం ముడిపడి ఉన్నాయని గుర్తించి, అన్ని రంగాల శాస్త్రవేత్తలు ఉమ్మడిగా పనిచేయాల్సి ఉంటుంది. అడవుల రక్షణ, వన్యప్రాణుల అక్రమ రవాణా నిరోధం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం ద్వారానే భవిష్యత్తులో ఇటువంటి కొత్త వైరస్‌లు మానవ సమాజంపై దాడి చేయకుండా అడ్డుకోగలము.

భవిష్యత్తులో ఎబోలా వంటి మహమ్మారులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే అంతర్జాతీయ సమాజం నిరంతర అప్రమత్తతతో వ్యవహరించాలి. బలహీనమైన ఆరోగ్య వ్యవస్థలు ఉన్న పేద దేశాలకు ధనిక దేశాలు ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందించాలి. మారుమూల ప్రాంతాలలో కూడా వేగంగా వ్యాధిని నిర్ధారించే మొబైల్ ల్యాబొరేటరీలను ఏర్పాటు చేయాలి. వైద్య సిబ్బందికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ, వ్యక్తిగత రక్షణ పరికరాలను (PPE Kits) నిరంతరం అందుబాటులో ఉంచాలి. అన్నింటికంటే ముఖ్యంగా స్థానిక ప్రజలలో మూఢనమ్మకాలను తొలగించి, శాస్త్రీయ పద్ధతులపై, అంత్యక్రియల భద్రతపై విస్తృతమైన అవగాహన కల్పించాలి. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు (Early Warning Systems) మరియు కృత్రిమ మేధస్సు (AI) సాంకేతికతను ఉపయోగించి వ్యాధి వ్యాప్తిని ముందే అంచనా వేయాలి.

ప్రస్తుత ప్రపంచీకరణ (Globalization) యుగంలో ప్రపంచమంతా ఒక చిన్న గ్రామంగా మారిపోయింది. ఒక దేశంలోని మారుమూల గ్రామంలో ఉద్భవించిన వైరస్, కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే విమాన ప్రయాణాల ద్వారా ప్రపంచంలోని ఏ ఇతర మెట్రోపాలిటన్ నగరానికైనా చేరుకోగలదు. అందువల్ల ఎబోలా అనేది కేవలం ఆఫ్రికా ఖండానికి చెందిన సమస్య మాత్రమే కాదు, అది సమస్త మానవాళికి పొంచి ఉన్న ముప్పు. గత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుని, వైద్య పరిశోధనలను మరింత బలోపేతం చేస్తూ, ప్రపంచ దేశాలన్నీ రాజకీయ భేదాలను పక్కనబెట్టి ఉమ్మడి వ్యూహంతో నడిచినప్పుడే ఎబోలా వంటి ప్రాణాంతక మహమ్మారులపై మానవాళి విజయం సాధించగలదు. నిరంతర నిఘా, శాస్త్రీయ దృక్పథం మరియు అంతర్జాతీయ సహకారమే ఈ అదృశ్య శత్రువుపై మనకున్న అత్యంత శక్తివంతమైన ఆయుధాలు.

-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494



## విద్యార్థులు స్వీయ రక్షణ అలవరచుకోవాలి

**– మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు**

**– కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్టుల ప్రదానం**





రాజన్న సిరిసిల్ల, జూన్ 6: (నేటినిజం ప్రతినిధి): విద్యార్థులు చదువుతో పాటు స్వీయ రక్షణ అలవర్చుకోవాలని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు అన్నారు. పట్టణంలోని శనివారం మహా లింగేశ్వర గార్డెన్‌లో శనివారం ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో చీఫ్ ఎగ్జామినర్, సీనియర్ మాస్టర్ అబ్దుల్ మన్నన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేసవి శిక్షణ పూర్తి చేసుకుని తదుపరి స్థాయికి అర్హత సాధించిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలను పెంపొందిస్తాయని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో శారీరక దృఢత్వం, స్వీయ రక్షణ నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమన్నారు. తదుపరి బెల్ట్ స్థాయికి చేరుకున్న విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబర్చి వేములవాడకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆసక్తి పెంచుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవధూత రజినీకాంత్, కో-ఆప్షన్ సభ్యుడు పీర్ మహమ్మద్, సిపిఐ పార్టీ నాయకులు గుంటి వేణు, కరాటే శిక్షకులు లోలోపు రాజు, దండుగుల శంకర్, పి. భాస్కర్, బి. శ్యామ్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రజల ముంగిట 'ప్రజా పాలన' సభలు

**– మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

రాజన్న సిరిసిల్ల, జూన్ 6: (నేటినిజం ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 4, 16, 17, 18, 19వ వార్డుల్లో శనివారం ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందించాలని కోరారు. వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి డ్రైనేజీల శుభ్రత, బ్లీచింగ్, ఫాగింగ్ చర్యలను ముమ్మరం చేస్తామని తెలిపారు. భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాగునీరు, డ్రైనేజీ, వీధిదీపాలు తదితర సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మున్సిపల్ మేనేజర్ సంపత్‌రెడ్డి, ఎస్ఐ రామ్మోహన్, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవు

**– తరచు ప్రత్యేక డ్రైవ్ లు– జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**



రాజన్న సిరిసిల్ల, జూన్ 6: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా శుక్రవారం రోజు జిల్లా వ్యాప్తంగా పోలీసులు బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 84 మంది మందు బాబులను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగడంతో పాటు ఇతర నేరాలకు అవకాశం ఏర్పడే ప్రమాదం ఉందని, ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్పీ మహేష్ బి గితే హెచ్చరించారు. జిల్లాలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో లైటింగ్ తక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ మరింత సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

## సనాతన హిందూ ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో చెస్ క్రీడ పోటీలు...

కరీంనగర్, జూన్ 5: (నేటినిజం ప్రతినిధి) సనాతన హిందూ ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో 50 రోజుల పాటు విజయవంతంగా చెస్ క్రీడా శిక్షణ తరగతులు చేపట్టారు. చెస్ క్రీడా కోచ్ కొప్పర్తి శివయ్య పర్యవేక్షణలో చెస్ తరగతులను రెండు విడతలలో నిర్వహించారు.

చెస్ కాంపిటీషన్లో గెలుపొందిన విద్యార్థులకు, చిన్నారులకు శనివారం రోజున ముఖ్యఅతిథి 49 వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ బహుమతుల ప్రధానం చేశారు. చెస్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులు కె. అవిష ( మొదటి), ఎన్ సాయి (రెండవ) , కార్తికేయ మూడో బహుమతి ని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రధానంగా వేసవి సెలవుల్లో పిల్లలను ప్రోత్సహించడానికి చెస్ క్రీడ పోటీలను, కూచిపూడి, భరతనాట్యం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని సనాతన హిందూ ధర్మా సేవా సమితి బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ధర్మ సేవా సమితి నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు



## ఏపీలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. పలు ప్రాంతాల్లో వర్షాలు

అమరావతి, జూన్ 6: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ అధికారుల సమాచారం ప్రకారం.. జూన్ 4న కేరళను తాకిన రుతుపవనాలు, అక్కడి నుంచి అత్యంత వేగంగా ముందుకు కదిలి ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లోకి అడుగుపెట్టాయి. రాబోయే కొన్ని రోజుల్లో ఇవి దక్షిణ కోస్తా జిల్లాలతోపాటు రాయలసీమ ప్రాంతమంతటా విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గత రెండుమూడు రోజులుగా ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే రుతుపవనాల రాకతో రాబోయే వారంలో ఏపీవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత కొన్ని రోజులుగా జనాలను హడలెత్తించిన భానుడి భగభగలు తగ్గి, ఉష్ణోగ్రతలు ఈ వర్షాలతో అదుపులోకి రానున్నాయి. మరోవైపు రుతుపవనాల ప్రవేశంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

## రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేశ్ నామినేషన్

అమరావతి, జూన్ 6: ఏపీలో రాజ్యసభ అభ్యర్థిగా జనసేనకు చెందిన లింగమనేని రమేశ్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలపై ఆరుగురు జనసేన, ముగ్గురు టీడీపీ, ఒకరు బీజేపీ ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. నామినేషన్ల పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేశారు. అనంతరం లింగమనేని రమేశ్ అభ్యర్థి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యత్వానికి కూటమి తరుఫున అవకాశమిచ్చిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. నామినేషన్ల కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు, తదితరులు పాల్గొన్నారు. కృష్ణా జిల్లా పెదముత్తేవి గ్రామానికి చెందిన లింగమనేని జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.